# మహానది

MAHANADI TELUGU DAILY

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 346 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | మంగళవారం| మార్చి | 17 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## బీహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీయే

పాట్నా,మార్చి,17:బీహార్‌లో జరిగిన ఐదు రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఐదు స్థానాల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకుని ప్రతిపక్ష 'మహాగఠ్‌బంధన్'కు గట్టి షాక్ ఇచ్చింది. ఈ విజయంతో ఎన్డీయే కూటమి తమ సంఖ్యాబలాన్ని మరోసారి నిరూపించుకుంది. ఎన్డీయే తరఫున ముఖ్యమంత్రి, జేడీయూ జాతీయ అధ్యక్షుడు నితీశ్ కుమార్, బీజేపీ నేత నితిన్ నబిన్, కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, రాష్ట్రీయ లోక్ మోర్చా చీఫ్ ఉపేంద్ర కుష్వాహా, బీజేపీ అభ్యర్థి శివేష్ రామ్ బరిలో నిలిచి విజయం సాధించారు. సోమవారం బిహార్ శాసనసభలో జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే పక్షాన 202 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, మహాగఠ్‌బంధన్ నుంచి కేవలం 37 మంది ఎమ్మెల్యేలు మాత్రమే పాల్గొన్నారు. మరోవైపు, ప్రతిపక్షాలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు గైర్హాజరు కా వడం చర్చనీయాంశంగా మారింది.



## అసెంబ్లీ ఆవరణలో 'తెలంగాణ తల్లి'
# విగ్రహావిష్కరణ

### ఈ విగ్రహం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనమన్న రేవంత్

- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్, మల్లు భట్టి, పలువురు మంత్రులు
- తెలంగాణ శాసనసభ ఆవరణలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది
- దేశానికి వారు అందించిన గొప్ప సేవలను స్మరించుకున్నారు

హైదరాబాద్,మార్చి16, తెలంగాణ శాసనసభ ఆవరణలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర గౌరవానికి, సంస్కృతికి ప్రతీకగా నూతనంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రతిష్ఠించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## నాటో దేశాలకు ట్రంప్
# వార్నింగ్

- హర్మూజ్ తెరిచేందుకు తమతో కలిసి రావాలని పిలుపు
- యుద్ధ నౌకలను పంపించాలని నాటో దేశాలకు సందేశం
- నాటో తన బాధ్యత నెరవేర్చకుంటే భవిష్యత్తు కష్టమేనని హెచ్చరిక



ఇంటర్నెట్ డెస్క్,మార్చి16 పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్రదేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రెటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి "చాలా దారుణంగా" ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు.హర్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. "అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు.

## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్
# కొరత లేదు


- అన్ని రాష్ట్రాలలో ఎల్పీజీ స్టాక్ ఉందన్న కేంద్ర ప్రభుత్వం
- గృహ వినియోగదారుల కోసం 100 శాతం స్టాక్ ఉందన్న కేంద్రం
- హర్మూజ్ జలసంధి వద్ద భారత నౌకలు క్షేమంగా ఉన్నాయని వెల్లడి
- ఎల్పీజీ క్యారియర్ నౌక శివాలిక్ సాయంత్రం భారత్ చేరుకుంటుందని వెల్లడి



న్యూఢిల్లీ,మార్చి16, వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది.పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. నేడు సాయంత్రం 5 గంటలకు ఈ క్యారియర్ భారత్ చేరుకునే అవకాశం ఉందని తెలిపింది.పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది.

## మూడు రోజుల
# నష్టాలకు బ్రేక్

- గత మూడు రోజులుగా స్టాక్ మార్కెట్ సూచీలు పతనం
- నేడు ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల జోరు
- మార్కెట్లకు అండగా నిలిచిన ఆటో, బ్యాంకింగ్ షేర్లు
- సెన్సెక్స్ 939, నిఫ్టీ 257 పాయింట్ల లాభంతో ముగింపు



న్యూఢిల్లీ,మార్చి16, దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. గత మూడు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల జోరు పెరగడంతో సూచీలు పుంజుకున్నాయి. ముఖ్యంగా ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లు మార్కెట్‌కు అండగా నిలిచాయి.సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 939 పాయింట్లు (1.26 శాతం) లాభపడి 75,502.85 వద్ద స్థిరపడింది.అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 257.70 పాయింట్లు (1.11 శాతం) పెరిగి 23,408.80 వద్ద ముగిసింది. అయితే, ప్రధాన సూచీలు లాభపడినా బ్రాడర్ మార్కెట్లలో బలహీనత కనిపించింది.



## తైవాన్ వద్ద మళ్లీ చైనా
# దూకుడు

- రెండు వారాల విరామం తర్వాత తైవాన్ వద్ద మళ్లీ చైనా సైనిక కార్యకలాపాలు
- ఒక్కరోజులో 26 యుద్ధ విమానాలు, 7 నౌకలను గుర్తించినట్లు తెలిపిన తైవాన్

ఇంటర్నెట్ డెస్క్,మార్చి16 తైవాన్ జలసంధిలో గత రెండు వారాలకు పైగా కొనసాగిన అసాధారణ నిశ్శబ్దానికి తెరపడింది. చైనా తన సైనిక విమానాలు, నౌకలతో మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. గడిచిన 24 గంటల్లో తమ ద్వీపం చుట్టూ 26 చైనా సైనిక విమానాలు, 7 నౌకలు సంచరించినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఉదయం వెల్లడించింది.

## హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ
# ఆస్తులను కాపాడాం

- విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించామన్న గవర్నర్
- రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని ప్రకటన
- మహాలక్ష్మి పథకంతో రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడి




హైదరాబాద్,మార్చి16 హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రమించేతత్వం కలిగిన తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు అని ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజాకేంద్రీకృత పాలన ప్రభుత్వం విధానమని అన్నారు.విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకుందని తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్‌ను అనుసరిస్తున్నామని అన్నారు.2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనాలు ఉన్నట్లు తెలిపారు.ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని గవర్నర్ తెలిపారు.

# తైవాన్ వద్ద మళ్లీ చైనా దూకుడు..

- రెండు వారాల విరామం తర్వాత తైవాన్ వద్ద మళ్లీ చైనా సైనిక కార్యకలాపాలు
- ఒక్కరోజులో 26 యుద్ధ విమానాలు, 7 నౌకలను గుర్తించినట్లు తెలిపిన తైవాన్
- 16 విమానాలు తమ గగనతల రక్షణ జోన్‌లోకి ప్రవేశించాయని వెల్లడి

ఇంటర్నెట్ డెస్క్,మార్చి16 తైవాన్ జలసంధిలో గత రెండు వారాలకు పైగా కొనసాగిన అసాధారణ నిశ్శబ్దానికి తెరపడింది. చైనా తన సైనిక విమానాలు, నౌకలతో మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. గడిచిన 24 గంటల్లో తమ ద్వీపం చుట్టూ 26 చైనా సైనిక విమానాలు, 7 నౌకలు సంచరించినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఉదయం వెల్లడించింది. వీటిలో 16 విమానాలు తమ వాయు రక్షణ గుర్తింపు జోన్ లోని ఉత్తర, మధ్య, నైరుతి ప్రాంతాల్లోకి ప్రవేశించాయని పేర్కొంది



# బెంగాల్ ఎన్నికల వేళ ఈసీ సంచలన నిర్ణయం

- చీఫ్ సెక్రటరీ, హోం సెక్రటరీలపై బదిలీ వేటు
- కొత్తగా దుష్యంత్ నరియాలా, సంఘమిత్ర ఘోష్‌కు బాధ్యతలు
- స్వేచ్ఛాయుత ఎన్నికల కోసమే ఈ చర్యలన్న ఎన్నికల సంఘంఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల పోలింగ్

న్యూఢిల్లీ,మార్చి16 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), హోం సెక్రటరీలను ఆ పదవుల నుంచి తప్పించింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది.ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ లేఖ రాసింది. ప్రస్తుత చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, హోం సెక్రటరీ జగదీష్ ప్రసాద్ మీనాలను తక్షణమే బదిలీ చేయాలని ఆదేశించింది.



# జర్నలిస్టులు ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరి
- ఫెడరేషన్ సభ్యులకు ప్రమాద బీమా పత్రాలు అందజేత



**సూర్యాపేట, మహానది న్యూస్, మార్చి 16:** విధి నిర్వహణలో ప్రమాదాలకు గురవుతున్న జర్నలిస్టులు తాము అందించే ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరి లు కోరారు. జిల్లాలో ఉన్న జర్నలిస్టులు భవిష్యత్తులో ప్రమాదాల బారిన పడితే ఈ బీమా పథకం ఎంతో ఉపయోగపడుతుందని,తమ యూనియన్ లో సభ్యత్వం తీసుకున్న జర్నలిస్టులకు భరోసాగా ఈ ఇన్సూరెన్స్ బీమా సదుపాయాన్ని ఉచితంగా కల్పిస్తున్నామని అన్నారు. సోమవారం మోతే మండలం టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు ఓరియంటల్ ఇన్సూరెన్స్ పత్రాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ద్వారా సభ్యత్వం తీసుకున్న జర్నలిస్టులందరికి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోతె మండలం జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# మే 20న ఐఎఫ్ డబ్ల్యూజే ఎన్నికలు

- కేంద్ర సహాయ ఎన్నికల అధికారిగా మామిడి సోమయ్య
- ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ - ఈనెల 26 వరకు నామినేషన్లు



హైదరాబాద్,మహానది న్యూస్, మార్చి16: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) దేశవ్యాప్త ఎన్నికల షెడ్యూల్ ను ఆ సంఘం ప్రధాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి (సీఆర్వో) సంతోష్ చతుర్వేది విడుదల చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిలర్లు, అనుబంధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ సంఘం జాతీయ అధ్యక్ష ఎన్నికలు మే 20న ఢిల్లీలో జరుగుతాయి. ఎన్నికల నిర్వహణకు రాష్ట్రాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం కొనసాగుతుంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే ప్రతినిధి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ను కేంద్ర సహాయ ఎన్నికల అధికారి (ఏసీఆర్వో) గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మీడియాతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రెండేళ్లకోసారి ప్రతిష్ఠాత్మకం గా జరిగే ఐఎఫ్ డబ్ల్యూజే ఎన్నికలు సజావుగా జరిగేలా తనను ఏసీఆర్వో గా నియమించడం అభినందనీయమని, తనకు అప్పగించిన ఈ బాధ్యతను సంఘం నియమ, నిబంధనల మేరకు నిజాయితీగా అమలు చేస్తానని అన్నారు. జాతీయ అధ్యక్షుడి ఎన్నికతో పాటు రాష్ట్రాల వారీగా జాతీయ మండలి సభ్యులు, రాష్ట్ర ప్రతినిధుల ఎన్నిక కూడా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు నామినేషన్ ల స్వీకరణ, 28న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 5న నామినేషన్ల ఉపసంహరణ, మే 20న పోలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 12 మంది జాతీయ మండలి సభ్యులు, మరో 12 మంది రాష్ట్ర ప్రతినిధుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

# ఆర్టీసీ కార్మిక సమస్యలపై మంత్రికి వినతిపత్రం



హైదరాబాద్, మహానది న్యూస్, మార్చి 16: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యుయూ) రాష్ట్ర కమిటీ సోమవారం రవాణా శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ మూసివేత పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుతం సంస్థను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. కార్మికులు ఆందోళన చెందకుండా సమస్యల పరిష్కారంలో కొంత సమన్వయం పాటించాలని సూచించారు. డీఏలు, ఇతర పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ(ఎస్‌డబ్ల్యుయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిశాల అబ్రహం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెక్కుల మల్లేశ్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, ఎండీ అక్బర్ అలీ, సి పాండు, శివకుమార్, ఎం సంపత్, విజయబాబు, వీబి రావు, కేఎస్ రెడ్డి, కేజీ సాగర్, టిఆర్ రెడ్డి, ఎంకే రాజు, రజిని కుమార్, జెఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలపై పీసీసీ అధ్యక్షుడికి వినతి



హైదరాబాద్, మహానది న్యూస్, మార్చి16:కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యుయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను సంబంధిత మంత్రితో పాటు ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మరో నాలుగైదు రోజుల్లో ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యుయూ) కమిటీని పిలిపించి సమస్యలపై ప్రత్యేకంగా చర్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యుయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిశాల అబ్రహం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశ్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, ఎండీఅక్బర్ అలీ, సి పాండు, శివకుమార్, సంపత్, విజయబాబు, వీబి రావు, కేఎస్ రెడ్డి, కేజీ సాగర్, పీఆర్ రెడ్డి, ఎంకే రాజు, రజిని కుమార్, జెఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హిమాయత్ నగర్ లో... ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

-పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ




హైదరాబాద్, మహానది న్యూస్, మార్చి16: హిమాయత్ నగర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మిక మహిళలకు చింతల రామచంద్ర రెడ్డి చీరలను పంపిణీ చేసి వారిని సన్మానించారు. మహిళల ను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సమాజం కోసం కష్టపడే పారిశుధ్య కార్మికులను మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించడం అభినందనీయం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిటీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ జీ, హిమాయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు పీ. ప్రసాద్, బీజేపీ సిటీ వైస్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్, నవీన్, కేశబోయిన కవిత, అర్జున్ సింగ్, తుల్జా రామ్, కార్తిక్, వాణి, మనీలా, శాంతి, అభిషేక్ యాదవ్, నందు, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, మహిళల అభివృద్ధి, గౌరవానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# గడ్డి మందు నిషేధించాలి

-తెలంగాణలో రైతులు చనిపోతున్నారు
-వ్యవసాయ డైరెక్టర్ కు జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ వినతి




హైదరాబాద్, మహానది న్యూస్, మార్చి 16: కలుపు నివారణ కోసం వాడే గడ్డి మందు మూలంగా తెలంగాణలో రోజుకు అనేక మంది రైతులు చనిపోతున్నారని, దానిని తక్షణమే నిషేధించాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడ్డి మందు నిషేధంతో పాటు వ్యవసాయ మందుల షాపుల్లో వాటి విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కేఎస్ఆర్ సోమవారం తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి. గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలుపు నివారణ కోసం వాడే గడ్డి మందు రైతుల పాలిట శాపంగా మారుతోందని, చిన్న చిన్న ఇబ్బందులతో మనస్థాపానికి గురైన వారు ఆవేశంతో దానిని తాగడం వల్ల వెంటనే మరణిస్తున్నారని, ఫలితంగా అనేక రైతు కుటుంబాలు ఆగమవుతున్నా యని ఆయన వివరించారు. గడ్డి మందు వల్ల తెలంగాణ వ్యాప్తంగా రోజుకు పదుల సంఖ్యలో రైతులు చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందు వల్ల భూమి కూడా విషతుల్యం అవుతుందని వెంటనే దీనిని నిషేధించాలని కేఎస్ఆర్ గౌడ పేర్కొన్నారు.
గడ్డి మందు నిషేధం కోసం చర్యలు తీసుకుంటామని, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని డైరెక్టర్ తెలిపారు. తమ పరిధి మేరకు తక్షణమే ఒక నెల రోజుల పాటు మందు నిషేధానికి తాము చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి ప్రిస్క్రిప్షన్ మేరకు ముందును అమ్మడం కూడా సరికాదని, గడ్డి మందును పూర్తిగా నిషేధించాలని కేఎస్ఆర్ తెలిపారు. గడ్డి మందుకు ప్రత్యామ్నాయాలు చూడాలని కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు.

# ఏప్రిల్ 4న హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలి




హైదరాబాద్, మహానది న్యూస్,మార్చి 16: రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం మైదానంలో ఏప్రిల్ 4న సాయంత్రం 5 గంటలకు నిర్వహించే హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం అధ్యక్షులు పెండ్యాల రామకృష్ణ పిలుపునిచ్చారు.
హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం రాజేంద్రనగర్ లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ సమ్మే ళనం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెండ్యాల రామకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు బాలరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అమరేందర్, సంయుక్త కోశాధికారి పెంటయ్య, ప్రచార కమిటీ కార్యదర్శి వేముల రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. హిందువులను ఒకదాటిపైకి తెచ్చి సనాతన ధర్మం పరిరక్షణ కోసం భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక విలువలు అందించేందుకు హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలన్న లక్ష్యంతో హిందూ మేళనం నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.


# రెండో దశ మెట్రో పై బిగ్ అప్ డేట్



హైదరాబాద్, : హైదరాబాద్ నగరవాసులకు మెట్రో గుడ్‌న్యూస్ చెప్పింది. రెండో విడత విస్తరణకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చింది. మొత్తం ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గాలను నిర్మించనున్నారు. నాగోల్-శంషాబాద్.. రాయదుర్గం-నియోపోలిస్.. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట.. మియాపూర్-పటాన్ చెరు.. ఎల్బీ నగర్-హయత్ నగర్ మార్గాల్లో మెట్రో అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు రూ.24,269 కోట్ల అంచనా వ్యయం అవుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా.. దాని వల్ల పెరుగుతున్న ట్రాఫిక్‌ను పెరగకుండా ఉంచేందుకు ఈ మెట్రో రెండో దశ విస్తరణ చాలా కీలకం కానుంది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై బిగ్ అప్‌డేట్ వచ్చింది. మెట్రో విస్తరణలో భాగంగా రెండో దశలో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గం నిర్మించనున్నారు. హైదరాబాద్ నగరవాసులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంతోపాటు.. నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో రైలును విస్తరించేందుకు ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మెట్రో విస్తరణ జరిగితే.. లక్షలాది మంది నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

# ఆర్చరీలో జోషితకు స్వర్ణ పతకం




**హైదరాబాద్, మహానది న్యూస్,మార్చి 16:** జాతీయ కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో ఆర్చరీ పోటీలో నగరానికి చెందిన వీరవల్లి జోషిత అద్భుత ప్రతిభను కనబరిచి జూనియర్స్ విభాగంలో స్వర్ణ పతకం, సబ్ - జూనియర్స్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. హిమాచల్ ప్రదేశ్ లో మార్చి 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 4వ ఎన్టిపిసి, నేషనల్ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీలలో హైదరాబాద్ కుచెందిన 15 సంవత్సరాలవి.జోషిత పాల్గొని అద్భుత ప్రతిభను కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చింది. మహర్షి విద్యా మందిర్ 10వ తరగతి చదువుతోంది. కొంపల్లిలోని అరుణ్ ఆర్చరీ అకాడమీలో కోచ్ అరుణ్ కుమార్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతోంది. జోషిత. జాతీయ స్థాయి ఎంపికలకు అర్హత పొందేందుకు ఈ పోటీలు ముఖ్యమైన ర్యాంకింగ్ ఈవెంట్ గా ఉందని జోషిత తెలిపారు.

# రోజుల్లోనే 800 మందికిపైగా మిస్సింగ్

న్యూఢిల్లీ ఢిల్లీలో మిస్సింగ్ కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది మొదటి 15 రోజుల్లోనే 500మందికిపైగా మహిళలు, బాలికలు సహా 800 మది ఆచూకీ లేకుండాపోయారు. ఇవేవో ప్రతిపక్షాలు, హక్కుల సంఘాలు చేస్తున్న ఆరోపణలు కాదు. పోలీసుల రికార్డులే ఇవి చెబుతున్నాయి. జనవరి 1 నుంచి 15 మధ్య నమోదయిన మిస్సింగ్ కేసుల్లో కేవలం 235 మంది ఆచూకీ గుర్తించారు. ఇక, తప్పిపోయిన వారిలో ఎక్కువ శాతం వయోజనులే ఉన్నారు.అయితే, అదృశ్యమైనవారిలో 235 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. మిగతా 572 మంది ఏమయ్యారో తెలియరాలేదని పోలీసుల రికార్డులు చూపుతున్నాయి. అలాగే, కనిపించకుండాపోయిన మొత్తం కేసుల్లో 191 మంది మైనర్లు ఉండటంతో బాలల భద్రతపై ఆందోళనను ఇది ఎత్తిచూపుతోంది. వీరిలో ఎక్కువ మంది బాలికలే (145 బాలికలు, 45 మది బాలురు) కావడం మరింత కలవరానికి గురిచేస్తోంది. తప్పిపోయిన మైనర్లలో ఎక్కువ మంది టీనేజర్లు ఉన్నారు. ఈ కాలంలో 169 మంది టీనేజర్లు తప్పిపోయినట్లు గుర్తించారు.
వారిలో 138 మంది బాలికలు, 31 మంది బాలురు. ఈ టీనేజర్ కేసులలో దాదాపు 71 శాతం ఇప్పటికీ పరిష్కారం కాలేదని పోలీసు డేటా సూచిస్తుంది.అలాగే, 8 నుంచి 12 ఏళ్లలోపు పిల్లలు 13 మంది అదృశ్యమయ్యారు. వీరిలో ఎనిమిది మంది అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలు ఉన్నారు.

# సంపాదకీయం

## కనుమరుగవుతున్న కట్టడాలు..!

ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారం గా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ – ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తు పూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషా యిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు – చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

# అట్రాసిటీ చట్టం బీసీలకు రక్ష...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలపై జరిగే దాడులు, బహిష్కరణలు, వేధింపుల్ని అరికట్టేందుకు త్వరలో రక్షణ కవచం లాంటి చట్టం రానుంది. గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా కూటమిప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువస్తోంది. గత వైసీపీ పాలనలో బీసీలపై కుల వివక్షతతో కూడిన దాడులు ఎన్నో జరిగాయి. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే పిల్లవాడి దగ్గర నుంచి ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య అనే నేత వరకూ అనేక మందిని దారుణంగా చంపేశారు. అదే సమయంలో వందల కుటుంబాల ఆస్తులు లాక్కున్నారు. కుమ్మరి,రజక, శెట్టిబలిజ, నాయి బ్రాహ్మణులు వంటి బీసీకులాల మీద ఆధీపత్యకులాల దాడులు జరిగినప్పటికీ వారికి ప్రత్యేకచట్టాలు లేక పోవడం వల్లే నిందితులు సులభంగా తప్పించుకోగలిగారు. కులవివక్ష ఆధీపత్య పోరుకు అడ్డుకట్ట వేయాలంటే ప్రత్యేక చట్టం అవసరమనే భావనబస్సు యాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, యువగళ పాదయాత్ర సమయంలో మంత్రి నారా లోకేష్ లకు కలిగింది. బీసీలునేటీకీ సామాజికంగా రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారనే విషయాన్ని వారు పసిగట్టారు. 21 శతాబ్ధంలోనుకులం పేరుతో దూషించడం సామూహిక బహిష్కరణలు చేయడం,వృత్తి పనులను హేళన చేయడంఆగకపోవడం చంద్రబాబు నాయుడు, లోకేష్ లనుతీవ్రంగా కలచివేసింది. ఎస్సీ,ఎస్టీలకు అట్రాసిటీచట్టం రక్షణ కవచంలా ఉన్నప్పటికీ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసిలకు రక్షణ చట్టం తీసుకురావాలన్న నిర్ణయానికి చంద్రబాబు,లోకేష్ లు వచ్చారు. బీసీలను ఆదుకోవాలని నిర్ణయించి.. బీసీ డిక్లరేషన్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రకటించారు. బీసీ డిక్లరేషన్ కనుగుణంగా ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అంతే అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి అటు చంద్రబాబు ఇటు లోకేష్ లుబీసిల రక్షణ కోసం చట్టం తీసుకువచ్చే దానిపైనే దృష్టి కేంద్రీకరించరనడానికి ఆత్మగౌరవ రక్షణ చట్టం ముసాయిదానే అందుకు నసాక్ష్యం. బీసీ వర్గాల పట్ల వారికున్న చిత్తశుద్ధి అంకితభావానికి ఇదే ప్రత్యేక నిదర్శనం. ఈ చట్టం అమల్లోకి వస్తే, బీసీలపై జరిగే అన్యాయాలకు అడ్డుకట్ట పడుతుంది. ఈ చట్టం ప్రకారం, బీసీలపై ఎవరైనా సామాజిక బహిష్కరణ, దూషణలు, దాడులు, వేధింపులు వంటి అఘాయిత్యాలకు పాల్పడితే, వారికి కఠిన శిక్షలు తప్పవు. మొదటిసారి నేరం చేస్తే 6 నెలల నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా పడుతుంది. మళ్లీ అదే నేరం చేస్తే, శిక్ష మరింత పెరుగుతుంది. కనీసం ఏడాది నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. న్యాయస్థానం ఈ శిక్షను ఇంకా పెంచవచ్చు. ముఖ్యంగా బీసీలపై వేధింపులకు సంబంధించిన కేసుల్లో ముందస్తు బెయిల్ పొందే అవకాశం ఉండదు. ఈ కొత్త చట్టం ప్రకారం, బీసీలపై జరిగే అత్యాచార కేసుల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే, సెషన్స్ కోర్టులనే ప్రత్యేక న్యాయస్థానాలుగా నియమించే అవకాశం ఉంది. ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం కేసుల పరిష్కార సమయాన్ని తగ్గించడం.

ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటి నుండి రెండు నెలల్లోనే కేసును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రత్యేక కోర్టులో తీర్పు సంతృప్తికరంగా లేదని ఎవరైనా భావిస్తే, వారికి హైకోర్టును ఆశ్రయించే అవకాశం కల్పించారు. తీర్పు వెలువడిన 90 రోజుల్లోపు హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. గరిష్టంగా 180 రోజుల వరకు ఈ గడువును పొడిగించే అవకాశం కూడా ఉంది. ఈ ప్రత్యేక కోర్టులలో కేసుల విచారణ చేపట్టడానికి ఏడేళ్ల అనుభవం కలిగిన న్యాయ వాదులను నియమిస్తారు. ఇది కేసుల నిర్వహణలో నైపుణ్యాన్ని పెంచుతుంది. పౌరహక్కుల చట్టం–1955 లోని సెక్షన్ 10ఏ ప్రకారం.. అల్లర్లు జరిగే ఉన్న ప్రాం తాలను గుర్తించి, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టవచ్చు. అంతేకాకుండా, సమూహంగా జరిమానాలు విధించే అధికారం కూడా వారికి ఉంటుంది. ఈ చట్టం ఇతర చట్టాల కంటే ఎక్కువ ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. మంచి ఉద్దేశంతో



వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖమంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

అధికారులు తీసుకునే ఏ చర్యకైనా చట్టపరమైన రక్షణ ఉంటుంది. ఒకవేళ ఫిర్యాదులను స్వీకరించడంలో నిర్లక్ష్యం చేస్తే, సంబంధిత అధికారులకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ముఖ్యంగా, బీసీ (బల హీన వర్గాల) వ్యక్తులపై అభియోగాలు వచ్చినప్పుడు, వారికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు పడేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యాలను సృష్టించిన వారికి కఠిన శిక్షలు ఉంటాయి. అలాంటి వారికి జీవిత ఖైదుతో పాటు జరిమానా కూడా విధిస్తారు. బీసీలపై జరిగే నేరాలకు సంబంధించి ఫిర్యాదులను నమోదు చేయడం, ఎఫ్ఐఆర్‌లను అందించడం, 60 రోజుల్లో ఛార్జిషీట్‌ను దాఖలు చేయడం వంటి ప్రక్రియల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే, వారికి కనీసం 6 నెలల నుంచి గరిష్ఠంగా ఏడాది పాటు జైలు శిక్షతో పాటు జరిమానా విధించేలా కొత్త ముసాయిదా చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా సాక్షులకు ప్రభుత్వ రక్షణ కూడా కల్పిస్తారు.

బీసీలపై దాడులు, ఎట్రాసిటీ కేసుల్లో బాధితులకు, సాక్షులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుంది .వారికి భద్రత కల్పించడమే కాకుండా, కేసు విచారణ జరిగే సమయంలో అయ్యే ప్రయాణ ఖర్చులు, తినడానికి అయ్యే ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. అంతేకాకుండా, వారి జీవితాన్ని తిరిగి చక్కదిద్దడానికి అవసరమైన సామాజిక, ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తుంది. బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం గురించి కోర్టుకు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలి. ప్రభుత్వం ఇచ్చే భరోసా, కల్పించే రక్షణ సరిపోతుందా లేదా అని కోర్టు ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. అవసరమైతే, కోర్టు తగిన ఆదేశాలు జారీ చేస్తుంది. ఎట్రాసిటీ అంటే ఏమిటో కూడా ఈ సమాచారం వివరిస్తుంది. బీసీలను కులం పేరుతో బహిరంగంగా లేదా ఇతరుల ముందు అవమానించడం, భయపెట్టడం, వారిని తక్కువ చేసి మాట్లాడటం వంటివి ఎట్రాసిటీ చట్టం కింద నేరాలుగా పరిగణిస్తారు. ఉద్దేశపూర్వకంగా అవమానించేలా మాట్లాడినా, సంకేతాలు వాడినా అది నేరమే. బహిష్కరణ, ప్రజాసేవల్లో వివక్ష, అక్రమ గెంటివేత, లైంగిక వేధింపులు, దాడులు వంటివి ఎట్రాసిటీ కిందకు వస్తాయి

సమూహ జరిమానా విధించే అధికారం పౌరహక్కుల చట్టం–1955లోని సెక్షన్ 10ఏ ప్రకారం ఉంటుంది. అఘాయిత్యాలకు అవకాశం ఉండే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఈ చట్టానికి విరుద్ధమైన ఇతర చట్టాలపై ఇది పై చేయి సాధిస్తుంది. సదుద్దేశంతో చేసే చర్యలకు రక్షణ సైతం ఉంటుంది.

### ఫిర్యాదులు స్వీకరించకుంటే జైలే:-

బీసీ వ్యక్తులపై అభియోగాలు వచ్చినప్పుడు, ఆ వ్యక్తికి మరణ దండన లేదా జీవిత ఖైదు శిక్ష పడేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యం సృష్టించిన వారికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తారు. బీసీలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదుల నమోదు చేశారు. ఆ తర్వాత ఎఫ్ఐఆర్ కూడా అందజేస్తారు. కేవలం 60 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు, విచారణ ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా కనీసం 6 నెలల నుంచి గరిష్ఠంగా సంవత్సరం పాటు జైలు శిక్ష, జరిమానా విధించేలా ముసాయిదా చట్టంలో పొందుపరిచారు.

### సాక్షులకు ప్రభుత్వమే రక్షణగా:

బీసీలపై దాడులు, ఎట్రాసిటీ కేసుల విచారణ సందర్భంగా బాధితులకు, సాక్షులకు ప్రభుత్వమే రక్షణ కల్పిస్తుంది. దర్యాప్తు, విచారణ, ట్రయల్ సమయంలో ప్రయాణ, పోషణ ఖర్చులు కూడా అందిస్తుంది. అదే విధంగా వారికి సామాజిక, ఆర్థిక పునరావాసం కల్పిస్తుంది. బాధితులకు ఏ విధంగా అండగా ఉంటున్నదీ ఎప్పటికప్పుడు న్యాయస్థానానికి ప్రభుత్వం తెలియజేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇస్తున్న రక్షణ, భరోసా సరిపోతుందో లేదో కోర్టు కాలానుగుణంగా సమీక్షిస్తుంది. దీనికి తగిన విధంగా ఉత్తర్వులు సైతం జారీ చేస్తుంది.

### ఎట్రాసిటీ కిందకు వచ్చేవి ఏంటేంటే?

భయపెట్టడం, బహిరంగంగా అవమానించడం లేదా ఇతరుల సమక్షంలో బీసీలను కులం పేరుతో అవమానకర పదాలు లేదా సంకేతాలతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం, తక్కువ చేయడం,ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలు నిరాకరించడం, ఉపాధి లేదా సేవలకు నిరాకరించడం,హౌసామాజిక బహిష్కరణకు గురి చేయడం. విద్య, ఆరోగ్యం, ప్రజా వనరులు, గృహవసతి కల్పనకు, ప్రభుత్వ ఉద్యోగాలకు కులం ఆధారంగా నిరాకరించడం. హౌచట్టబద్ధ అధికారం లేదా పరిహారం లేకుండా నివాసం లేదా భూమి నుంచి బలవంతంగా తొలగించడం. ప్రభుత్వ సేవలు లేదా పథకాలు అందకుండా అడ్డుకోవడం. దాడి చేయడం లేదా శారీరక గాయం కలిగించడం. మహిళలపై లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడటం. హాని చేయాలనే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టడం .కులం ఆధారంగా నివాస విభజనను అమలు చేయడం. భూమి, పంటలు, పశువులు తదితరాలను ఆక్రమించడం. నివాసం, జీవనోపాధి, పంటలు దెబ్బతీయడం. మత, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననీయకపోవడం. రహదారులు, బావులు, ఘాట్లు, శ్మశానాలు, ఆలయాలు వంటి ప్రదేశాల వినియోగాన్ని నిరోధించడం. అక్కడికి ప్రవేశాన్ని అడ్డుకోవడం. వంటి చర్యలకు పాల్పడేవారినిఈ చట్టం కఠినంగా శిక్షిస్తుంది.

### చట్టానికి తుది మెరుగులు :

ఇక బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇవ్వడానికి రంగం సిద్ధమైంది. ఇక ఇప్పటికే బీసీ చట్టం ముసాయిదా కూడా కూటమి ప్రభుత్వం సిద్ధం చేసింది. ఏపీలో ఉన్న 138 కులాలకు చెందిన బీసీల ధన, మాన, ప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా రూపొందించారు. ఈ చట్టం ప్రకారం 15 రకాల వేధింపులకు శిక్షలు రూపొందిస్తున్నారు. ఏపీలో అమలు చేయబోయే బీసీ రక్షణ చట్టం దేశంలోనే తొలిసారి అవుతుంది. ఈ చట్టంతో బీసీలపై దాడులు చేసే వారి గుండెల్లో రైళ్ళు పరిగెత్తిస్తుందనడంలో సందేహం లేదు.

# విద్యా మాఫియా



ఫీజుల దందాపై గళమిప్పిన ఎస్ఎఫ్ఐ నేతలను కిడ్నాప్ చేయడానికి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం బరితెగించిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బౌన్సర్లతో విద్యార్థి నేతలను బలవంతంగా ఎత్తుకుపోవడం, వారిపై అమానుషంగా దాడి చేయడం వంటి చర్యలు ఆ విశ్వవిద్యాలయంలో నేరాలు వ్యవస్థీకృతమైన తీరుకు, యాజమాన్య నేర ప్రవృత్తికి నిదర్శనాలు. విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం కొత్తేమీ కాదు! మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగింది కూడా ఇదే! కానీ, విద్యాసంస్థ యాజమాన్యం అన్ని పరిధిలను అతిక్రమించి ప్రశ్నించిన వారిని ఎత్తుకెళ్లి, భౌతికదాడులు చేసి, అంతం చేసేలా వ్యవహరించడం ఖచ్చితంగా రాష్ట్రంలో కొత్త పరిణామమే! ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమా అని కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకున్న విద్యావ్యవస్థకు ఇప్పటికే లాభార్జన ప్రధానంగా మారింది. అక్కడి నుండి తమ ఖజానాలు నింపుకోవడానికి, ఎంతటి దారుణమైనా చేసే మాఫియా ముఠాల స్థాయికి కార్పొరేట్ విద్యా వ్యవస్థ దిగజారుతున్న తీరుకు తాజా పరిణామం ఒక నిదర్శనం.

మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దందాపై దుమారం రేగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అధిక ఫీజుల వసూలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వచ్చాయి. రకరకాల పేర్లతో సాగిన ఫీజుల దందా శృతి మించడంతో నియంత్రణ సంస్థల జోక్యం, కోర్టుల దాకా ఈ వివాదాలు వెళ్ళాయి. దాదాపు 26 కోట్ల రూపాయలను యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి నిర్ధారించింది. అక్రమ వసూళ్లకు పాల్పడటంతో 15 కోట్ల రూపాయల జరిమానాను ఉన్నత విద్యామండలి విధించింది కూడా! విద్యార్థుల తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెనక్కి తీసుకోవడానికి పోరాటం కొనసాగించారు. మరోసారి ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. ఇది యాజమాన్యానికి నచ్చలేదు. యూనివర్శిటీ ప్రాంగణానికి వారిని పిలిపించి మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు బౌన్సర్లతో దాడి చేయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసే ఎస్ఎఫ్ఐ సహజంగానే ఈ దౌర్జన్యంపై దృష్టి సారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది

# భారత ప్రామాణిక కాలమానం అమలు

1906 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది. భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం భారతదేశ మంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ సమయానికి ఐదున్నర గంటలు ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు–ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశంను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది. చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా "జీరో డిగ్రీల రేఖాంశం" అవంతీ నగరం ( ఉజ్జయినికి (23ళీ10ః58?చీ 75ళీ46ః38జు / ?23.18278ళీచీ 75.77722ళీ), పూర్వపు పేరు) , రోహితక ( కురుక్షేత్ర యుద్ధభూమి దగ్గరలోని నగరం రోహ్‌తక్) (28ళీ54ః చీ 76ళీ38ఃజు/ ?28.900ళీచీ 76.633ళీజు) గుండా వెళుతుందని నిర్వచించ బడింది. రోహితక, అవంతి నగరాలు (భూమధ్యరేఖ, 76ళీ తూ) , దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి. సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహోరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహోరాత్రులు లేదా రోజులు ఉంటాయి. ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమాన మవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది.

# రాయలసీమకు మహర్దశ



కర్నూలు, : ఆంధ్రప్రదేశ్‌లో మరో పోర్టుకు సంబంధించి లైన్ క్లియర్ అయ్యింది. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న దుగరాజుపట్నం పోర్టుకు సంబంధించిన భూసేకరణకు మార్గం సుగమం అయ్యింది. మొత్తం 2,170.70 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. ఇప్పటికే ఫీజుబులిటీ రిపోర్ట్ కూడా కేంద్రం దగ్గరకు వెళ్లింది. త్వరలోనే పోర్టుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పోర్టులపై ఫోకస్ పెట్టింది. కొన్ని ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండగా.. మరికొన్ని భూసేకరణ దశలో ఉన్నాయి. తాజాగా మరో కొత్త పోర్టుకు సంబంధించి అప్డేట్ వచ్చింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నేషనల్ మెగా నౌకానిర్మాణ క్లస్టర్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పోర్టుకు సంబంధించిన టెక్నికల్ ఫీజిబులిటీ నివేదికను రైట్స్ అనే సంస్థ సిద్ధం చేసి కేంద్రానికి పంపించారు. కేంద్రం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిందని.. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందంటున్నారు. దుగరాజపట్నం పోర్టుకు సంబంధించి అవసరమైన టెక్నికల్ సహకారాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీ అందిస్తుందని చెబుతున్నారు.కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేస్తారు. కేంద్రం బడ్జెట్‌లో మారిటైంకు సంబంధించి బడ్జెట్‌లో రూ.1,765 కోట్లు కేటాయించగా.. వీటి నుంచి ఎక్కువ వాటా దుగరాజపట్నం ప్రాజెక్టుకు వస్తుంది అంటున్నారు. దుగరాజపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు- షిప్ బిల్డింగ్ క్లస్టర్ కోసం భూముల్ని సేకరించనున్నారు. దీని కోసం 2,170.70 ఎకరాల భూమి కావాలని ఇటీవల నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా తిరుపతి జిల్లాలో 1,995.04 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 175.66 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది.తిరుపతి జిల్లాలోని వలమేడులో అత్యధికంగా 724 ఎకరాలు, ఆ తర్వాత వగ్రురులో 529 ఎకరాలు, పామంజిలో 489 ఎకరాలు, పాతేటిపాలెంలో 251 ఎకరాలు సేరించాలని భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో కోట మండలంలోని పుచ్చలపల్లిలో 129 ఎకరాలు, కొత్తపట్నంలో 46 ఎకరాలు సేకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం
రూ.544.30 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే పూర్తి వివరాలు తెలుస్తాయంటున్నారు.రాష్ట్ర విభజన సమయంలో చట్టం ప్రకారం పోర్టుకు అవసరమైన నిధులు కేంద్రం నుంచి సమకూర్చాల్సి ఉంటుంది. ఈ మేరకు దుగరాజపట్నం పోర్టు ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు రూ.30వేల కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే.. ప్రతి ఏటా ఏకంగా 5లక్షల టన్నుల సరకు రవాణా చేయొచ్చు.. పోర్టుతో పాటుగా షిప్‌యార్డు, నౌకానిర్మాణంతో పాటుగా మరమ్మతుల వ్యవస్థ కూడా చేయొచ్చు.
ఈ ప్రాజెక్టును మారిటైం బోర్డు, వీపీఏ (విశాఖపట్నం పోర్టు అథారిటీ) కలిసి అభివృద్ధి చేస్తాయి. వాస్తవానికి దుగరాజుపట్నం పోర్టు ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా ఉంది.. కానీ పేపర్ల వరకే పరిమితం అయ్యింది. ఇప్పుడు కేంద్రం సహకారంతో ఏపీ ప్రభుత్వం భూసేకరణ దిశగా అడుగులు వేస్తోంది.

# అరవ బలిపశువు అయ్యారా?



కడప: రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం వెనక కుట్ర జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. అరవశ్రీధర్ చేసింది తప్పే. వివాహిత మహిళతో సంబంధాన్ని కొనసాగించడాన్ని ఎవరూ అంగీకరించరు. అలాగే మహిళ కూడా ఎమ్మెల్యే కావడంతో అరవ శ్రీధర్ అంటే ఇష్టపడి దగ్గరయ్యారు. అయితే వీరు విడిపోవడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై లైంగిక వేధింపులు రావడంతో జనసేన పార్టీ వెంటనే త్రిసభ్య కమిటీని నియమించింది. నిన్న విచారణ కూడా పూర్తి చేసింది. నివేదిక ఏమిస్తుందన్నది చూడాలి. అయితే అరవ శ్రీధర్ వ్యవహారంలో కొత్త కోణం బయటపడుతుంది. ఎస్సీ యువకుడు కావడంతో కొందరు కావాలనే తమ పట్టు నుంచి జారి పోతారని భావించి ఇద్దరి మధ్య గ్యాప్ క్రియేట్ చేశారంటు న్నారు. జనసేన నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై పోలీసు కేసు కూడా నమోదయింది. ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం కలిగించింది. మరొకవైపు అరవ శ్రీధర్ ను సదరు మహిళ పాతిక కోట్ల రూపాయలు డిమాండ్ చేసి బెదిరించిందని ఆరోపణలు కూడా వినిపించాయి. ఓ మహిళ మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసినా అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేయలేదని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎట్టకేలకు అరవ శ్రీధర్ పై కేసు నమోదైంది. తిరుపతి జిల్లా ఎస్పీకి ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కూడా ఈ కేసులో దర్యాప్తును వేగంగా కొనసాగించి వాస్తవాలు బయటకు తీసుకు వచ్చే అవకాశాలు న్నాయి.అయితే సాధారణంగా ఎస్సీ నియోజకవర్గం అంటే అగ్ర కులాల పెత్తనం ఉంటుంది.
దాదాపు అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అదే పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఎస్సీ ఎమ్మెల్యేలపై అగ్రవర్ణాల నేతల పెత్తనం ఎక్కువగా కనపడేది. కొందరు ధైర్యంగా ఎదురుతిరుగుతారు. చాలా మంది ఎమ్మెల్యే పదవి చాలు అని మౌనంగా ఉంటారు. అరవ శ్రీధర్ కు రైల్వే కోడూరులో అసలు పనే లేదట. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అసలు పెత్తనం చేసేది మాత్రం టీడీపీకి చెందిన నేతగా చెబుతున్నారు. అతని కనుసన్నల్లోనే ఈ వ్యవహారం సాగుతుంది. ఇద్దరు కలసి ఉండాలని భావించినా ఆ మహిళ అరవ శ్రీధర్ కు తోడుగా ఉంటే తమ పనులు చెల్లుబాటు కావని భావించి ఇద్దరినీ దూరం చేశారంటున్నారు. తొలి నుంచి అరవ శ్రీధర్ ఆ కుటుంబానికి సేవకుడిగానే ఉంటున్నారన్నది టాక్.గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రైల్వే కోడూరు నియోజకవర్గం అభ్యర్థిగా యనమల భాస్కరరావును బహిరంగంగానే ప్రకటించారు.

# అమరావతి ఓఆర్ఆర్ 250 అడుగులు

అమరావతి, : ఏపీ రాజధాని అమరావతికి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసి భూమిని సేకరిస్తున్నారు.ఈ క్రమంలో ఓఆర్ఆర్ భూసేకరణ 140 మీటర్ల వెడల్పు బదులు 250 మీటర్ల వెడల్పు కోసం చేపడుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో రైతులు ఆందోళన వ్యక్తం చేయగా.. అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఆందోళన అవసరం లేదన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అన్ని జిల్లాలు కనెక్ట్ చేసేలా ఔటర్ రింగ్ రోడ్డు రాబోతోంది. అమరావతి ఓఆర్ఆర్‌కు సంబంధించి భూసేరణ ప్రక్రియ కూడా చేపట్టారు. గుంటూరు, పల్నాడుతో పాటుగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూసేకరణ చేపట్టారు. అయితే ఓఆర్ఆర్‌ను 140 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారని ప్రతిపాదించారు. అయితే అమరావతి ఔటర్‌కు సంబంధించిన గెజిట్‌లో మాత్రం 250 మీటర్లుగా పేర్కొన్నారట. దీంతో రైతులు అధికారుల్ని అడిగి క్లారిటీ తీసుకుంటున్నారట.. 250 మీటర్లు ముందు జాగ్రత్త మాత్రమేనని.. ఓఆర్ఆర్‌ను మాత్రం 140 మీటర్ల వెడల్పుతోనే నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారట.
మామూలుగా అధికారులకు 3ఏ నోటిషికేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండా భూమి సర్వేకు హక్కు ఉండదు అంటున్నారు. అప్పుడు కొలతలు తీసి హద్దులు వేయలేరని.. జీపీఎస్‌పై ఆధారపడాలి అంటున్నారు. జీపీఎస్‌ను 140 మీటర్ల వెడల్పు ప్రామాణికంగా తీసుకుని హద్దులు నిర్ణయిస్తే.. కొన్ని చోట్ల 5 నుంచి 10 మీటర్లు తేడా వస్తుంది అంటున్నారు. అదే జరిగితే ఈ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని.. ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందంటున్నారు. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొన్నారట. భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత సర్వే పూర్తి చేసిన అనంతరం 140 మీటర్లకే కొలత వేసి సరిహద్దులు వేస్తారు. ఆ మేరకు మాత్రమే భూమిని కూడా తీసుకుంటారు.. ఈ అంశాలను తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారని చెబుతున్నారు. ఎవరికి ఆందోళన అవసరం లేదంటున్నారు.
అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో భూసేకరణ కోసం గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో ఓఆర్ఆర్ 140 బదులుగా 250 మీటర్ల భూసేకరణ ఉంటుందని పేర్కొన్నారు. అందుకే రైతులు ఒకింత ఆందోళనలో ఉన్నారట.
140 కాకుండా 250 తీసుకుంటే తాము నష్టపోతామన్నది రైతుల వాదన.. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన అవసరం లేదంటున్నారు. రైతులకు ఎలాంటి అనుమానాలు అవసరం లేదని.. 140 మీటర్ల భూమి మాత్రమే తీసుకుంటామన్నారు.

# రొయ్యల ధర పతనం



ఒంగోలు: ఒకపక్క రొయ్యల ధర పతనం అవుతుండగా, మరో పక్క రొయ్యల మేత ధర పెరుగుతోంది. దీంతో, రొయ్య రైతులకు చెంపదెబ్బ, గోడదెబ్బ తగిలినట్టయింది. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగవుతున్నాయి. ఏటా సీజన్‌లో 11 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువగా రొయ్యల సాగు ఉంది. తీరప్రాంతంలో పెద్ద ఎత్తున రొయ్యలను సాగు చేస్తున్నారు. 80 శాతం విదేశాలకు ఎగుమతులతో ఈ రంగం అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ నెల రెండో తేదీ వరకూ వంద కౌంట్ రొయ్యల ధర కిలో రూ.270 ఉండేది. ప్రస్తుతం ఈ ధర ఇప్పుడు రూ.250కు పడిపోయింది. మిగతా కౌంట్ల ధరలూ తగ్గాయి. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో 45 శాతం అమెరికాకు ఎగుమతి అయ్యేవి. మిగతావి యూరోపియన్ దేశాలకు పంపుతారు. రొయ్యలపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్న అమెరికా ప్రకటించినా రొయ్యల ధర అదే రోజు పతనం కావడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రొయ్యల మేతపై ప్రస్తుతం ఉన్న ఐదు శాతం దిగుమతి సుంకాన్ని 2.5 శాతానికి తగ్గించింది. మేత ధర తగ్గుందని రైతులు ఆశించగా, పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంపు గతంలో రొయ్యలపై సుంకాన్ని ఒక్కసారిగా 50 శాతం పెంచేశారు. ఆ ప్రకటన వెలువడిన వెంటనే అప్పట్లో వ్యాపారులు ధరను అమాంతరం తగ్గించేశారు. రైతులు తీవ్ర నష్టాలను చవి చూశారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి సారించాల్సి వచ్చింది. అమెరికాకు ఎగుమతులు దాదాపు నిల్చిపోవడంతో అవకాశం ఉన్న మేరకు యూరప్ దేశాలకు ఎగుమతులు అవుతున్నాయి. మరోవైపు దేశీయంగానూ రొయ్యల వినియోగంపై దృష్టి సారించారు. రెస్టారెంట్లలోనూ వినియోగం పెరిగిందని అంచనా. రొయ్యలపై సుంకాన్ని 18 శాతం చేస్తున్నట్టు రెండ్రోజుల క్రితం ట్రంపు ప్రకటించినా వ్యాపారులు ధర పెంచకపోగా, అదే రోజు నుంచి తగ్గించడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు మేలు చేసే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని, నష్టం చేసే విషయంలో మాత్రం వెంటనే అమలు చేస్తున్నారని వాపోతున్నారు.

## సిరిపురం ప్రత్యేక పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



మంథని ప్రతినిధి: మంథని మండలం సిరిపురం గ్రామంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ,పెద్దపెల్లి జిల్లా కలెక్టర్, జిల్లా పశు వైద్య పశు సంవర్ధక శాఖ పెద్దపల్లి జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఏడు రోజుల కార్యక్రమంలో భాగంగా 6 వ రోజు మంథని మండలం సిరిపురం గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించగా విశేష స్పందన లభించింది.. ఈ ప్రత్యేక పశు వైద్య శిభిరం లో జబ్బు పడిన 483 పశువులకు చికిత్స, 182 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు (గాలికుంటు, ముద్దచర్మవ్యాధి మరియు రేబిస్ టీకాలు) వేశారు. 22 పశువులకు చూడి పరీక్షలు,8 పశువులకు గర్భకోష వ్యాధులకు చికిత్స అందించారు.330 దూడలకు నట్టల నివారణ మందులు 2 పశువులకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అంతే కాకుండా పాడి పశువుల,జీవాల యజమాన్య పద్దతులు,పశుపోషణ మరియు వివిధ రకాలపశు గ్రాసాలపై సాగుపై పాడి రైతులకుఅవగాహన కల్పించ డం జరిగిందని మంథని మండల పశువైద్య అధికారి డాక్టర్ టి.రవి కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విజయ భాస్కర్,హైద రాబాద్ పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ లత, డాక్టర్ డి.అనుష,డాక్టర్ ఎస్.ప్రత్యూష , మేఘా నాయక్,సిరిపురం సర్పంచ్ గోదారి లక్ష్మీ రాయమల్లు,ఉప సర్పంచ్ ఈసంపల్లి నారాయణ,
వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి : బి.హన్మండ్లు,వెంకన్న,వాక్సీ నెటర్ అజయ్, గోపాలమిత్రాలు పానుగంటి సంజీవ్ కుమార్, కొండయ్య, రామకృష్ణ, మల్లేష్, పి.జి, యూ.జీ విద్యార్థులు సహాయక సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నరవాణె రణం...

భారత పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల చర్చ జరిగింది. ఇందులో విపక్ష నేత రాహుల్ గాంధీ అసలు అంశంపై మాట్లాడకుండా మాజీ ఆర్మీ చీఫ్ నరవాణె ఆత్మకథలోని అంశాలు ప్రస్తావించారు. 2020 గల్వాన్ ఘటన సమయంలో చైనా దూసుకువచ్చినప్పుడు ప్రభుత్వం ధైర్యం చేయలేదని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భయపడ్డారని పేర్కొన్నారు. అయితే ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదు.రక్షణ శాఖలో పనిచేసిన అధికారులు రాసే పుస్తకాలు ప్రచురణకు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి తప్పనిసరి. ఈ పుస్తకానికి అనుమతి ఇవ్వలేదు. కొన్ని అంశాలు మాత్రమే పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పార్లమెంటు నియమాల ప్రకారం నిరాధార అంశాలు, పుస్తకాలు, పత్రికా కథనాలు ఆధారంగా మాట్లాడకూడదు. నరవాణె వాస్తవానికి ప్రభుత్వం సరైన చర్యలే తీసుకుందని పేర్కొన్నారు.ఆసియాలో భారత్?చైనా సంబంధాలు మెరుగుపడితే అమెరికాకు ఇబ్బంది. రాహుల్ ప్రసంగం దీన్ని ఆపే ప్రయత్నంగా కనిపిస్తోంది. అమెరికా సందర్శనల్లో చైనా విషయాలు ప్రస్తావించడం, వాణిజ్య ఒప్పందాల హడావుడి ఈ భావనకు బలం చేకూరుస్తున్నాయి. పార్లమెంటు వేదికను ఉపయోగించి దౌత్య సంబంధాలను దెబ్బతీయాలనే ఉద్దేశం ఉందా అన్న చర్చ ఊపందుకుంది. చైనాతో సరిహద్దు సమస్య విషయంలో మోదీ సర్కారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించిందని భారత మాజీ సైన్యాధిపతి ఎంఎం నరవణెతెలిపారు. నిర్ణయాలన్నీ కేంద్రీకృతంగా ఉండేవని చెప్పారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ యుద్ధం వైపు మొగ్గు చూపలేదని వెల్లడించారు. సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలను రాజకీయ ఆదేశాలు లేకుండా సైన్యమే సొంత నిర్ణయాలతో పరిష్కరించుకోవాలన్నట్లుగా ప్రభుత్వ విధానం ఉండేదన్నారు. సైన్యం కూడా చైనా దురాక్రమణలను సమర్థంగా నిలువరించిందని, అయితే, చాలా వివాదాలు పరిష్కారం కాకుండానే మిగిలిపోయాయని చెప్పారు. చైనాతో సరిహద్దు పరిణామాల మీద దేశ ప్రజలకు పూర్తి అవగాహన కలిగించకుండా ప్రభుత్వం పరిమితులు విధించిందని అభిప్రాయపడ్డారు. చైనా విషయంలో కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చినపుడు రాజకీయ నాయకత్వం సైనికపరంగా కానీ, దౌత్యపరంగా కానీ మార్గదర్శనం చేయలేదని చెప్పారు. 2020 ఆగస్టు 31న చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించినపుడు కూడా ఏది మంచిదైతే అదే చేయండంటూ నిర్ణయాన్ని తమకే వదిలేశారన్నారు. మొత్తం మీద చైనాను నిలువరించామే కానీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేదని చెప్పారు. నిర్ణయాలు తీసుకొని అమలు చేయాల్సిన బాధ్యతతో పాటు జవాబుదారీతనాన్ని కూడా సైన్యం మీదే పెట్టారని తెలిపారు. అయితే, "మోదీ క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఫోర్సె?సను చాలా గౌరవంగా చూసేవారు. ఏం చెప్పినా శ్రద్ధగా వినేవారు" అని నరవణే పేర్కొన్నారు. 2019 డిసెంబరు 31 నుంచి 2022 ఏప్రిల్ 30 వరకు భారత సైన్యాధిపతిగా పనిచేసిన నరవణే జనరల్‌గా తన ప్రయాణాన్ని "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ" పేరుతో పుస్తకం రాశారు. ఆ పుస్తకాన్ని ప్రచురించేందుకు భారత ప్రభుత్వం అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆయన పుస్తకంలోని అంశాలను ప్రస్తావిస్తూ కారవాన్ మ్యాగజీన్ 40 పేజీల సుదీర్ఘ వ్యాసాన్ని ప్రచురించింది. చైనా విధానాన్ని రాజకీయ నాయకత్వం కేంద్రీకృతం చేసింది. ప్రధాని కార్యాలయం, భద్రతా సలహాదారు కార్యాలయం చేతుల్లో ఉంటుంది. సైన్యం పదేపదే స్పష్టత కోరాల్సిన పరిస్థితి. నిజానికి ఒకడుగు ముందుకు వేస్తే యుద్ధం అనే పరిస్థితి ఉంటుంది. కానీ, ఏం చేయాలో చెప్పరు. 2020 ఆగస్టు 31 పరిస్థితే ఇందుకు ఉదాహరణ. తూర్పు లద్ధాఖ్‌లోని రెచిన్ లా వద్ద నాలుగు చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించాయి. అప్పటికే అదే లద్ధాఖ్‌లోని గల్వాన్ లోయలో రెండున్నర నెలల ముందు చైనా చొరబాట్లను నియంత్రించే క్రమంలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతో?షబాబు సహా 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొందారు. అలాంటి పరిస్థితుల్లో రెచిన్‌లా వద్ద భారత ఫార్వార్డ్ పొజిషన్ల వద్దకు చైనా ట్యాంకులు వచ్చేశాయి. ఎదురుదాడి చేయాలా? నియంత్రణ పాటించాలా? 'వాట్ ఆర్ మై ఆర్డర్స్' అని రాజకీయ నాయకత్వాన్ని అడిగాం. ఏది సరైన నిర్ణయమని భావిస్తారో అదే చేయండి అంటూ ప్రధాని నుంచి కింది వారి ద్వారా ఆదేశాలు వచ్చాయి. ఎదురు దాడికి దిగితే యుద్ధంలోకి వెళ్లే అవకాశాలే ఎక్కువ. అది సైన్యం మాత్రమే తీసుకోవాల్సిన నిర్ణయం కాదు. దాంతో మళ్లీ అడిగాం. నిర్ణయం ప్రకటించేందుకు రాజకీయ నాయకత్వం సిద్ధం లేదని సందేశం వచ్చింది. యుద్ధాలను సంబంధించిన నిర్ణయాలను సైన్యానికి వదిలేయకూడదు. దౌత్యం, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ పొత్తులను ప్రభావితం చేసే అంశాల్లో సైన్యాధిపతి నిర్ణయం తీసుకోలేదు. అయితే, నియంత్రణ పాటిస్తూ సైన్యాన్ని మోహరించాం. చివరకు చైనా సైన్యం సంప్రదింపులకు వచ్చింది.లద్ధాఖ్‌లో 2020లో చైనా పథకం ప్రకారం ఆక్రమణలకు పాల్పడింది. గల్వాన్‌లోనే కాదు. పలుచోట్ల ఆక్రమణలు జరిగాయి. కొన్ని భారత్ ఆలస్యంగా గ్రహించింది. ఒత్తిడిలో స్పందించాల్సిన పరిస్థితి. సరిహద్దు వెంట పలుచోట్ల ఇరు సైన్యాలు తలపడాల్సి వచ్చింది. గల్వాన్ ఒక్కటే కాదు. చర్చల ద్వారా కొన్నిచోట్ల వెనక్కి తగ్గారు కొన్నిచోట్ల బఫర్ జోన్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల పెట్రోలింగ్ మీద నియంత్రణలు పాటించాలని నిర్ణయించారు. అయినా కొన్ని చోట్ల పరిష్కారం కాలేదు. గల్వాన్ దాడి పథకం ప్రకారం జరిగింది. చైనా సైన్యం భారత సైనికులను బంధించి కొట్టింది. భారత్ తీవ్రంగా ప్రతిఘటించి చైనాకు తీవ్ర నష్టం చేయడంతో హఠాత్తుగా స్టేటస్ కో నాటకం ఆడింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు జీవితకాలంలో మరచిపోలేని పాఠం అందించాం. అయితే, గల్వాన్ మరణాలు ఒకేసారి జరగలేదు. గాయాలతో, మంచు ప్రభావంతో చనిపోయారు. మరికొంత మందిని బంధించి హింసించి వదిలేశారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రభుత్వం పార్లమెంటుకు కానీ, ప్రజలకు కానీ పూర్తి సమాచారం ఇవ్వలేదు. మన సైనికులు ఎలా చనిపోయారో, ఈ సంఘటన తర్వాత అక్కడ భూభాగం మోహరింపులో ఎలాంటి మార్పులు జరిగాయో సమాచారం అందించలేదు.చైనాతో చర్చల విధానంలో రాజకీయ స్థాయిలో లోపాలున్నాయి. మొదట్లో రాతపూర్వకమైన రికార్డులకు అనుమతించలేదు. కోర్ కమాండర్ స్థాయి చర్చల్లో మినిట్స్ లేవు. నిర్ణయాలను ఆమోదించడం లేదు. ప్రతీదీ రికార్డు రూపంలో ఉండాలన్న సైన్యం ప్రయత్నం అమలు చేయడం విదేశాంగ శాఖ వ్యతిరేకత వల్ల ఆలస్యమైంది. ప్రభుత్వ సౌలభ్యం కోసం వాస్తవాధీన ప్రాంతాల విషయంలో కూడా చెరో పాయింట్‌ను ప్రస్తావించేందుకు, మధ్యలో బఫర్ జోన్లు ఉంచేందుకు అంగీకరించారు. ఇది సైన్యానికి ఇబ్బందికరం. అగ్నిపథ్‌పైన కూడా త్రివిధ దళాల అధిపతులతో అర్థవంతమైన సంప్రదింపులు జరగలేదు.

# కార్ల ధరలకు రెక్కలు!

### రెండు శాతం వరకు పెంచిన లగ్జరీ కార్ల సంస్థలు
### అదే బాటలో మరిన్ని ఆటోమొబైల్ కంపెనీలు




కార్ల ధరలకు మళ్లీ రెక్కలురాబోతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశీయ కరెన్సీ విలువ పాతాళంలోకి పడిపోయింది. దీంతో దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు తమ వాహన ధరలను పెంచడానికి మరోసారి సిద్ధమవుతున్నాయి. డాలర్, యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం చెందడంతోపాటు ఉత్పత్తి వ్యయం అధికం కావడం వల్లనే వాహన ధరలు పెంచాల్సి వస్తున్నదని ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. వీటికి తోడు దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత కూడా తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నదని, ఈ ఇబ్బందికర పరిస్థితులు ఆటోమొబైల్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. సామాన్యుడికి ఊరట కల్పించాలనే ఉద్దేశంతో గతంలో కేంద్ర ప్రభుత్వం తక్కువ సీసీ సామర్థ్యం కలిగిన కార్లపై జీఎస్టీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో వాహన సంస్థలు ధరలను భారీగా తగ్గించాయి.

**క్రూడాయిల్ సెగ**

అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పదిహేను రోజుల్లో క్రూడాయిల్ ధరలు 40 శాతానికి పైగా పెరిగాయి. దీంతో క్రూడాయిల్‌తో ఉత్పత్తి అయ్యే ఇంజిన్ ఆయిల్ కోసం అధికంగా వెచ్చించాల్సి రానుండటం కూడా ధరలు పెరగడానికి మరో కారణం. గత నెల చివర్లో 73 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ధర ప్రస్తుతం 103 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది. సుమారుగా 30 డాలర్లు మేర పెరిగింది. పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకూ ముదురుతుండటంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లో ఆందోళన నెలకొన్నది. సమీప భవిష్యత్తులో బ్యారెల్ ధర 200 డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని అంచనాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో చమురు దిగుమతులపై ఆధారపడుతున్న భారత్ లాంటి దేశాల ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

**బెంజ్ కార్లు...**

లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కూడా తన వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్టు మెర్సిడెజ్-బెంజ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్(సేల్స్ అండ్ మార్కెటింగ్) బ్రెండన్ సిస్సింగ్ తెలిపారు. యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పడిపోవడంతోపాటు ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో సంస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను స్వల్పంగా పెంచినట్టు చెప్పారు. పెరిగిన ధరలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**ఆడీ కార్లు మరింత ప్రియం**

లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ మరోసారి వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా వాహన ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడం తోపాటు కరెన్సీ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థ రూ.43.23 లక్షల నుంచి రూ.2.34 కోట్ల లోపు ధర కలిగిన పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

# భారత భావనకే ఇ.సి ఎసరు

భారతదేశమనే భావన సావర్కర్ అల్లిన హిందూత్వ భావజాలం లోంచి రూపొందలేదు. బ్రిటిష్ వలస పాలనను తరిమికొట్టేందుకు సాగిన జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో చిందిన నెత్తురు, చమట నుంచి అది రూపుదిద్దుకుంది. 1950 జనవరి 26న స్వీకరించబడిన రాజ్యాంగం పునాది స్తంభాలకు దోహదం చేసిన ఒక కొత్త తరహా సిద్ధాంత పత్రాన్ని ఆ భావన తీసుకొచ్చింది.ఆ ప్రాథమిక సూత్రాలేమిటి? ఆర్థిక, రాజకీయ, సార్వభౌమత్వం అన్నవి వలస పాలన తొలగింపు దిశగా ప్రయాణం, స్వాతంత్ర్య పోరాట కొనసాగింపులే కావడం తర్కబద్ధమైన విషయం. భారతీయ భావన లౌకిక మార్గం చేపట్టవలసి వచ్చింది. ప్రజల స్వేచ్ఛను గుర్తించడం, తమ విశ్వాసాలను అనుసరించేందుకు వారికిగల సమాన హక్కును గౌరవించడం, ఎలాంటి బుజ్జగింపులకూ లేక ప్రలోభాలకు లోబడకపోవడం సహజంగానే అవసరమైంది. అది తప్పక ప్రజాస్వామికంగా వుండవలసిందే. ఎందుకంటే బలహీనులకూ అధికారంగల వారికి మధ్య గొప్ప వ్యత్యాసాన్ని, అవకాశాలు, సంపదలలో వున్న అగాధాన్ని భర్తీ చేయడం సాధ్యపడదు. అనేక జాతుల, సంస్కృతుల, భాషల, ఆహార, వేషధారణల వైవిధ్యభరితమైన బహుళత్వాన్ని కాపాడేందుకు అది సమాఖ్యతత్వం తీసుకోవలసి వచ్చింది. లేకపోతే హిందూత్వ అనుయాయులు చెబుతున్నట్టు ఏకధృవ ఏకపక్ష మూస పద్ధతిలో ఒకే వరలో ఇమడ్చడం సాధ్యపడేది కాదు.

**ప్రాణాధార సూత్రం**

భారతదేశమనే ఏ భావననైతే రాజ్యాంగం స్థాపించిందో అది నయా ఫాసిస్టు నమూనా పుస్తకంగా వుండజాలదన్నది స్పష్టమే. భారతదేశమనే భావన భిన్నత్వంతో కూడిన ప్రజలకు ఒకే ఉమ్మడి సమాన పౌరసత్వం వర్తింపచేసింది.
అలాంటి భావన సార్వత్రిక వయోజన ఓటింగు అనే సూత్రం ప్రాతిపదికగా వుండాల్సిందే. అందరికీ ఒకే విధమైన భాగస్వామ్యమన్న సూత్రం అప్పుడే అమలవుతుంది. జాతీయ భాష, జాతీయ మతం అన్నది రాజ్యాంగం ఉద్దేశించిన వాటిలో లేదు.
పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యంలోని దృక్పథం వలెగాక ఈ దేశంలో సార్వత్రిక ఓటుహక్కును ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అమలు చేయవలసి వచ్చింది. అలాంటి విధానం లేకపోయినట్టయితే ఒక సమిష్టి ఉమ్మడి మనుగడతో భారత దేశ సమైక్యతకు ముప్పు వాటిల్లేది. ఈ ఆలోచన అమలుకు కేంద్రకం బలమైన రాజ్యాంగ సాధికారత కలిగిన భారత ఎన్నికల సంఘం (ఇసిఐ). ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అమలును అది పర్యవేక్షించాలి. అంతేగాక ఎన్నికల సంఘం చట్టబద్ధంగా భారత పౌరులైన ప్రతివారినీ ఓటర్ల జాబితాలో చేర్చడం ఇసిఐ పని అన్నది సుస్పష్టం. అది బాధ్యతే తప్ప ఎంతమాత్రం ఔదార్యం కానే కాదు. అందువల్లనే ఓటర్ల జాబితా తయారీ ఎన్నికల సంఘం పని తప్ప వ్యక్తిగతంగా పౌరుల పని కానే కాదు. భారత దేశమనే భావనను అమలు చేయడం కోసం రాజ్యాంగం ఇసిఐ కి అప్పగించిన బాధ్యత అది. ఈ సూత్రం ప్రాతిపదికగా పనిచేయడం వల్లనే ఇసిఐ దేశంలోనేగాక ప్రపంచమంతటా గుర్తింపు పొందింది.


**ట్రంప్ ఐసిఇ-మన ఇసిఐ**

దురదృష్టవశాత్తూ సరిగ్గా ఇక్కడే భారతదేశమనే భావనకు ప్రస్తుతం ముప్పు ఎదురవుతున్నది. ఈ ప్రమాదానికి మూలం ఏమిటనే చర్చ పెద్దగా అవసరం లేదు. ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా పచ్చి మితవాద భావజాలం ప్రబలిన నేపథ్యంలో పౌరుల మత గుర్తింపులను బట్టి తేడాలు చూపించే హిందూత్వ సిద్ధాంతమే ఇందుకు కారణమవుతున్నది. ప్రపంచీకరణ, ఆయా దేశాల నిర్దిష్టమైన నయా ఉదారవాద నమూనాలు దీన్ని ఇంకా పెంచుతున్నాయి. ఈ కొత్త విధాన పత్రంలో పరాయివారిని చేయడం ఒక ప్రధాన భాగం.
డోనాల్డ్ ట్రంప్ ఐసిఇ (ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ఏజంట్ల లాగే ఇండియా వరకూ చూస్తే ఆరెస్సెస్ భయం, అభద్రత జొప్పించేందుకు ప్రయత్నిస్తున్నది. వాస్తవంగా చెప్పాలంటే భారతదేశ సంక్షేమానికి స్వయం ప్రకటిత పరిరక్షకుడుగా అమిత్ షా దేశ అంతర్గత భద్రతకు బాధ్యత చేపట్టారు. కానీ జాతి మూలాలను తినేస్తున్న "చెద పురుగుల" లాంటి ఆ చొరబాటుదార్లను గుర్తించేందుకు ఆయన చిటికెన వేలైనా కదల్చలేదు. కనుక కనీస సాక్ష్యాధారాల వంటివేమీ కూడా లేకుండానే చొరబాటుదారులు అన్న మాటను ఆయుధంగా చేయడం ఇసిఐ నమూనా పుస్తకంలోకి ప్రవేశించింది. గాలించు, తొలగించు, తరలించు అనే పొలికేక ఇసిఐ ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్.ఐ.ఆర్-సర్)కు అలిఖిత రాగంగా తయారైంది. చెద పురుగులుగా చిత్రించబడిన పౌరుల ఓటు హక్కు తొలగించడమే దాని లక్ష్యంగా మారింది.

**బీహార్ టు బెంగాల్**

ఏమైనా బీహార్‌లో మొదలై పన్నెండు రాష్ట్రాలలో కొనసాగుతున్న అలాంటి కసరత్తు తుది ఫలితాలు చూస్తే మాత్రం అలాంటి చొరబాటుదారుల ఆచూకీ చూపించే బలమైన సాక్ష్యాలు లేశమెత్తు కూడా బయిటపెట్టింది లేదు. ఇలాంటి తప్పుడు వైఖరి వల్ల నిజంగా జరిగిందేమంటే పేదలు, బలహీనులను దెబ్బ తీయడమే.
అందువల్ల ఇప్పుడు 'సర్' నిర్వహణ కోసం కాల వ్యవధిని కుదించడం పూర్తిగా పొరబాటని సుస్పష్టమవుతుంది. ప్రత్యేకించి పశ్చిమ బెంగాల్‌లో దీనివల్ల కలిగిన నష్టమేమిటో అందరికీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నది. సరిహద్దు రాష్ట్రమైన బెంగాల్‌లో చెప్పుకోదగినంత ముస్లిం జనాభా వుంటుంది. కొన్ని తరాలుగా వారు అక్కడ నివసిస్తున్నారు. ఇప్పుడు వారి ఓట్లనే రద్దు చేయడం జరుగుతున్నది.'సర్' ప్రక్రియ ప్రారంభించక ముందు అక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 7.66 కోట్లుగా వుండేది. ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించాక ఈ సంఖ్య 7.08కి పడిపోయింది. 2002-03 జాబితాలలో మిగిలిన వారు తమను తాము అనుసంధానించుకోలేక పోయారనే అంచనా దీనికి కారణమైంది. అనుసంధానం లేనివారంతా ఆధార పత్రాలు లేనివారో పౌరసత్వం లేనివారో అయితీరాలని లేదు.

# కోర్ కోర్సులు ఖతం!



### విద్యార్థుల నుంచి నో డిమాండ్
### ఐదేండ్లల్లో సగానికి పైగా తగ్గిన సీట్లు
### 178 ఇంజినీరింగ్ కాలేజీలు క్లోజ్
### ఏఐసీటీఈ అఫిలియేషన్ పెండింగ్
### ఈ సారీ కోర్‌కు కోతేనా?

సివిల్, మెకానికల్ కోర్సుల్లో 52%, ఎలక్ట్రికల్‌లో 46% ఇలా రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కోర్ బ్రాంచీల్లో సీట్లకు కోతపడింది. ఈ కోర్సుల్లో భారీగా సీట్లు తగ్గిపోయాయి. ఇదేదో దశాబ్దకాలంలో అనుకుంటే పొరపాటు పడ్డట్టే. 2019 నుంచి 2025 మధ్య కాలంలోనే. అంటే ఐదేండ్ల కాలంలోనే దాదాపు 50% కోర్ ఇంజినీరింగ్ సీట్లకు కోతపడింది. కాలేజీలు, యాజమాన్యాలు ఈ కోర్సుల్లోని సీట్లను తగ్గించుకుంటున్నాయి. తగ్గిన ఈ సీట్ల స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్ఈ) సీట్లు పెంచుకుంటున్నాయి. 2026-27 విద్యాసంవత్సరానికి ఇంజినీరింగ్ కాలేజీల అఫిలియేషన్ జారీ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఏప్రిల్‌లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి అఫిలియేషన్(ఏఐసీటీఈ) అనుమతులిస్తుంది. అయితే ఈ సారి కూడా అదే జరుగుతుందా..? కోర్ కోర్సుల్లో సీట్లు మరిన్ని తగ్గుతాయా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది.మే రెండో వారంలో ఫలితాలు విడుదలవుతాయి. ఆ తర్వాత ఇంజినీరింగ్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ మొదలవుతుంది. ఈ ఐదేండ్ల కాలంలో సీఎస్ఈ కోర్సుల్లో విద్యార్థుల చేరికలు 20% పెరిగాయి. ఐదేండ్ల క్రితం 42శాతమున్న ఎన్‌రోల్‌మెంట్ ఇప్పుడు 62శాతానికి పెరిగింది. 2019లో సీఎస్ఈ కోర్సుల్లో 29వేల సీట్లు నిండితే, 2025కు వచ్చేసరికి 48వేలు నిండాయి. సీఎస్ఈ తర్వాత అంతో ఇంతో డిమాండ్ ఉన్న ఏకైక కోర్సు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సు మాత్రమే. ఈ కోర్సులో చేరే వారి సంఖ్య కేవలం 5% మాత్రమే తగ్గింది. సీట్లు కూడా 8% లోపు తగ్గాయి. 2017లో 13,500 సీట్లు నిండితే.. 2025లో 12,600 మంది చేరారు. అంటే 5% మాత్రమే ప్రవేశాలు తగ్గాయన్నమాట.

**50% ఇంజనీరింగ్ కాలేజీలు క్లోజ్..**

రాష్ట్రంలో పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడుతున్నాయి. 2017-2025 మధ్య 50% మూతపడ్డాయి. ఐదేండ్ల క్రితం కాలేజీల సంఖ్య 353 ఉంటే, ఇప్పుడు 175కు చేరాయి. రాష్ట్రంలో ఒక కాలేజీ సగటు విద్యార్థుల సంఖ్య 611 మాత్రమే. జాతీయ సగటు 709గా ఉంది. విద్యార్థులు చేరకపోవడం, అధ్యాపకుల కొరత, ఏఐసీటీఈ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో యాజమాన్యాలు కాలేజీలను క్లోజ్ చేస్తున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. దేశంలోని ఇంజినీరింగ్ హబ్‌ల్లో తెలంగాణ ఒకటి. 40% స్థూల నమోదు నిష్పత్తితో ఉన్నత విద్య భాగస్వామ్యంలో అగ్రగామి రాష్ట్రంగా ఉంది. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలుండగా, వీటిలో 91% ప్రైవేట్ కాలేజీలే. వీటిల్లో 1.30 లక్షల సీట్లున్నాయి.తెలంగాణ వార్తలు

### ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అన్నవరం
# సమీపంలో పెద్దపులి కలకలం

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో గత 16 రోజులుగా సంచరిస్తున్న పులి, ఇప్పుడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం సమీపానికి చేరడంతో తీవ్ర కలకలం రేగింది. దీంతో అటవీ, పోలీసు, దేవస్థానం అధికారులు అప్రమత్తమై భక్తులకు, స్థానిక గ్రామస్థులకు హెచ్చరికలు జారీ చేశారు.శంఖవరం, ఊరకొండ ప్రాంతాల నుంచి కత్తిపూడి మార్గం దాటిన పులి, మండపం గ్రామం పొలాల మీదుగా అన్నవరం పంపా రిజర్వాయర్ మార్గంలోకి ప్రవేశించిందని అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నవరం, తాళ్లపాలెం, మండపం, బెండపూడి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. పొలాల్లో పనిచేసే రైతులు వెంటనే ఇళ్లకు తిరిగి రావాలని సూచించారు.అన్నవరం వచ్చే భక్తులు కూడా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో ఒంటరిగా ప్రయాణించవద్దని, వాహనాలను ఎక్కడా నిలపవద్దని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో వసతి గదుల నుంచి బయటకు రావద్దని స్పష్టం చేశారు.పులిని సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టారు. కాకినాడ జిల్లా డీఎఫ్‌వో ఎన్. రామచంద్రరావు నేతృత్వంలో సుమారు 100 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ట్రాకింగ్ బృందాలు, డార్టింగ్ సిబ్బంది పులి



కదలికలను నిరంతరం గమనిస్తున్నారని, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ రెడ్డి ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం పులి సంచారం నేపథ్యంలో ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

### డ్రగ్స్ ఎఫెక్ట్: ఎంపీ పుట్టా మహేశ్‌కు
# టీడీపీ షోకాజ్ నోటీసు

తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేశ్ పై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలో ఆయన మత్తుపదార్థాలు తీసుకున్నారన్న అంశం నేపథ్యంలో, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఐదు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని స్పష్టం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేసింది.ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పుట్టా మహేశ్ కు అధికారికంగా నోటీసు పంపారు. మార్చి 14వ తేదీన మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన ఘటన, ఆ తర్వాత మీడియాలో వచ్చిన కథనాలను పార్టీ అధిష్ఠానం చాలా సీరియస్‌గా తీసుకుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామాలు పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు."ఈ అంశంపై సమగ్ర నివేదిక వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పార్టీ మిమ్మల్ని ఆదేశిస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి మీ లిఖితపూర్వక వివరణను 5 రోజుల్లో పార్టీకి అందజేయాలి" అని నోటీసులో పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పుట్టా



మహేశ్ ఇచ్చే వివరణను పరిశీలించిన తర్వాత పార్టీ అధిష్ఠానం తదుపరి చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

# ఇపిఎఫ్ఓ ఏకపక్ష దాడి!




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) కేంద్ర ధర్మకర్తల మండలి (సిబిటి) మార్చి 2న ఉద్యోగుల పింఛను పథకం (ఇపిఎస్) 1995 స్థానంలో ఇపిఎస్ (2026)కు ఆమోదం తెలిపిన తీరు తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి ఏకపక్ష చర్య కారణంగా కేంద్ర ప్రభుత్వ పారదర్శకత కూడా ప్రశ్నార్థకం అవుతోంది. కంట్రిబ్యూషన్ చెల్లిస్తున్న సుమారు 5.4 కోట్ల మంది సభ్యులు (ఉద్యోగులు), 82 లక్షల మంది పింఛనుదార్లను ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇపిఎస్, ఉద్యోగుల భవిష్య నిధి మరియు డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాలు సామాజిక భద్రత కోడ్ (2020)కి సహజ పరిణామంగా రూపొందించబడినప్పటికీ ఇది 2025 నవంబర్ లో ఇతర మూడు కోడ్లతో పాటు అకస్మాత్తుగా నోటిఫై చేయబడింది. ప్రభుత్వం లేదా కార్మిక మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు కొత్త పథకాల గురించి ఎటువంటి సంకేతం, సమాచారం ఇవ్వలేదు. అధికారులు లబ్ధిదారులతో ఏ విధమైన సంప్రదింపులు జరపలేదు. ఏ ఇతర పథకం కంటే ఎక్కువగా ఇపిఎస్ 1995 గత దశాబ్ద కాలంగా భారత సర్వోన్నత న్యాయస్థానంతో సహా వివిధ న్యాయస్థానాలలో విచారణల కారణంగా మీడియాలో ప్రముఖ స్థానం ఆక్రమించింది కూడా! అయినా ప్రభుత్వం ఏకపక్షంగా ఇటువంటి చర్యలకు పాల్పడడం తగదు.

గత 12 సంవత్సరాలుగా, అంటే నరేంద్ర మోడీ నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడినప్పటినుండి ఈ పథకంలోని వివిధ అంశాలు ఉద్యోగులకు నష్టం కలిగించే విధంగా మార్చబడ్డాయి. ఉదాహరణకు పెన్షన్ పథకం యొక్క విస్తృతిని ప్రారంభంలో ఉద్దేశించిన విధంగా సార్వత్రిక కవరేజీని అందించడానికి బదులుగా నెలకు రూ. 15,000 వరకు సంపాదించే వారికి పరిమితం చేయడం చాలా ముఖ్యమైన మార్పు. పెన్షన్ పొందే జీతం గణన చివరి 12 నెలల సగటు నుండి 60 నెలలకు మార్చబడింది. దీనివలన చెల్లించవలసిన పెన్షన్ మొత్తం గణనీయంగా తగ్గిపోయింది. 2014 సెప్టెంబర్ 1న అమలులోకి వచ్చిన సవరించిన పథకం నుండి ఒక సంవత్సరంలోపు ఎంపికను ఉపయోగించుకున్న వారికి అధిక పెన్షన్‌పై అనియంత్రిత ఎంపిక పరిమితం చేయబడింది. అయితే, 2022లో సుప్రీంకోర్టు జోక్యంతో 2014 తర్వాత రిటైర్ అయిన వారికి ప్రత్యేక కేసుగా అధిక పెన్షన్ ఎంపిక అవకాశం కల్పించారు. కానీ 2014కి ముందు రిటైర్ అయిన వారు ఇబ్బందుల్లో పడ్డారు. ఇపిఎఫ్ఓ నిర్దేశించిన అవాస్తవిక పరిస్థితుల వల్ల వారిలో చాలామంది అధిక పెన్షన్‌కు అనర్హులయ్యారు. పింఛనుదార్లకు ఈ పన్నెండేళ్ల పాలనలో కలిగిన మరో తీవ్ర నష్టం ఇది.సిబిటి ఆమోదించిన కొత్త పెన్షన్ పథకంలో ఎంపిక చేసుకోవడానికి అవకాశం ఇస్తున్న నిబంధనను తొలగించారు. అది చట్టపరమైన వివరణను ప్రతిబింబించేదిగా లేదని సాకు చెబుతున్నారు. అంతేకాకుండా పిఎఫ్ కంట్రిబ్యూషన్ చెల్లించేందుకు వేతన పరిమితి రూ. 15,000 కన్నా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సవరణ తీసుకొస్తుందని ఇప్పటివరకూ ప్రచారం జరుగుతోంది. కానీ ఆ దిశగా ఏ ప్రకటనా రాలేదు. కేంద్ర ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నవారు తీవ్ర నిరాశకు గురయ్యారు. వేతన పరిమితి మరియు కనీస పెన్షన్ రూ. 1,000 -- ఈ రెండు అంశాలూ 11 సంవత్సరాల క్రితం నిర్ణయించినవి. ఇపిఎఫ్ఓ మొత్తం విధానం పరిశీలిస్తే లబ్ధిదార్లకు చెల్లించవలసిన పెన్షన్ తగ్గించడమే దాని ఏకైక లక్ష్యంగా వున్నట్టు కనిపిస్తోంది. ఎక్కువగా ప్రభుత్వ నిధులు మరియు యజమానుల నుండి, అలాగే స్వచ్ఛందంగా కంట్రిబ్యూషన్ చెల్లించే ఉద్యోగుల నుండి వచ్చే మొత్తాలతో ఇపిఎఫ్ఓ పెన్షన్ సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కోగలదు. కేంద్ర ప్రభుత్వం, ఇపిఎఫ్ఓ ల నుండి ఆశించేది సానుకూల దక్పథం అదేవిధంగా పింఛనుదార్లు, కంట్రిబ్యూషన్ చెల్లించే ఉద్యోగుల పట్ల సానుభూతి. అంతేతప్ప ఇలా చట్టాలు, నిబంధనలు, విధానాల మార్పు కోట్లాది మంది సభ్యులు మరియు లక్షలాది మంది పింఛనుదారులు కోరుకున్న ఫలితాలను ఇవ్వబోవు. అహరహం శ్రమ చేసే కష్టజీవుల ఉసురు పోసుకునే సర్కార్లు మనలేవు. శ్రామికులు సంఘటితమై పోరాడితే పాలకులు శంకరగిరి మాన్యాలు పట్టాల్సివుంటుందని గుర్తెరగాలి.

# మార్కెట్లకు 'క్రూడ్' షాక్



ముడి చమురు ధర సెగలు కక్కుతోంది. ఆదివారం రాత్రి భారత కాలమానం ప్రకారం 10 గంటల ప్రాంతంలో బ్రెంట్ రకం ముడి చమురు బ్యారెల్ ధర 103 డాలర్లు, వెస్ట్ టెక్సాస్ ముడి చమురు 99 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. గత నాలుగేళ్లలో ముడి చమురు ధర ఇంత భారీ స్థాయిలో ట్రేడవడం ఇదే మొదటిసారి. పశ్చిమాసియా యుద్ధంతో ఇరాన్ హార్ముజ్ జల సంధిని మూసివేయడం ఇందుకు ప్రధాన కారణం. 150 డాలర్లకు !: పరిస్థితులు ఎక్కువ రోజులు ఇలానే కొనసాగితే బ్యారెల్ ముడి చమురు ధర త్వరలోనే 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. నిజానికి ఈ యుద్ధం ప్రారంభంలోనే బ్యారెల్ బ్రెంట్ రకం ముడి చమురు ధర ఒక దశలో 120 డాలర్లకు చేరింది. అయితే అమెరికా, ఇతర దేశాలు తమ అత్యవసర చమురు నిల్వల నుంచి పెద్ద మొత్తంలో చమురును విడుదల చేయడంతో ధరలు కొద్దిగా దిగి వచ్చాయి. ఇప్పట్లో ఈ యుద్ధానికి ముగింపు కనిపించని వాతావరణంలో ముడి చమురు ధర మళ్లీ సెగలు కక్కుతోంది. ఇది త్వరలోనే 110 నుంచి 125 డాలర్లకు, ఆ తర్వాత 145-150 డాలర్లకు చేరే అవకాశం లేకపోలేదని కోటక్ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ అనింద్య బెనర్జీ తెలిపారు. ఇదే జరిగితే భారత, చైనా, జపాన్, దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణుల అంచనా.

స్టాక్ మార్కెట్ 'బేర్': గల్ఫ్ యుద్ధంతో భారత స్టాక్ మార్కెట్ ఇప్పటికే తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. గత రెండు వారాల్లో నిఫ్టీ ఎనిమిది శాతం నష్టపోయింది. దీంతో దాదాపు రూ.30 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోయింది. ఈ ఆటుపోట్లకు భయపడి ఎఫ్‌పీఐలు కూడా పెద్ద ఎత్తున అమ్మకాలకు తెర తీశాయి. గత రెండు వారాల్లోనే ఈ సంస్థలు భారత స్టాక్ మార్కెట్ నుంచి రూ.52,704 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు సెగ ఇలానే కొనసాగితే ఎఫ్‌పీఐలు మరింత పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగే అవకాశం ఉందని ఏంజల్ వన్ బ్రోకరేజి సంస్థ సీనియర్ ఫండమెంటల్ అనలిస్ట్ వకార్ జావేద్ ఖాన్ చెప్పారు. సూచీలు మరో 10% వరకు నష్టపోయే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

ఆర్థికానికి ముప్పు: ముడి చమురు కొండెక్కడంతో దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఇక్కట్లలో పడవచ్చు. ధరల సెగ ద్రవ్యోల్బణాన్ని మళ్లీ ఎక్కడ పోటెత్తిస్తుందో అని ఆర్‌బీఐ భయపడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజు రోజుకీ క్షీణిస్తోంది. ఇప్పటికే ఇది రూ.92కి చేరింది. పరిస్థితి ఇలానే కొనసాగితే రూపాయి మారకం రేటు రూ.93-94కు కూడా చేరే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. చమురు సెగతో ద్రవ్య, వాణిజ్య, మూల ధన ఖాతా (సీఏడీ) లోటు కూడా అదుపు తప్పే ప్రమాదం కనిపిస్తోంది.


బులియన్ దారి ఎటు?: అంతర్జాతీయ ఉద్రిక్తతలు ముదిరినపుడు బంగారం, వెండి ధరలు కొండెక్కడం సహజం. అయితే ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. చము రు సెగ, అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై అధిక వడ్డీరేటు ఇందుకు ప్రధాన కారణం. అయితే డాలర్‌తో రూపా యి మారకం రేటు రికార్డు స్థాయికి చేరడంతో ఈ వారం భారత మార్కెట్‌లో పసిడి, వెండి ధర కొద్దిగా పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.

# బంగారం, వెండి ధరలు.. మరింత డౌన్..



అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి.అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది (+శీశ్రీస జూతీఱవం). ఈ రోజు (మార్చి 14న) ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది (శ్రీఱజవ ప్రశీశ్రీస తీఫ్‌వం). నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గిందిమరోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది

# పెట్టుబడుల్లో 'ఆమె'దే నిర్ణయం



ఆర్థిక నిర్వహణలో భారతీయ మహిళల ఆలోచన ధోరణి క్రమంగా మారుతోంది. ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం గణనీయంగా పెరిగింది. 'విన్వెస్టర్ పల్స్ 2025-26' పేరుతో డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్...ఆర్థిక నిర్వహణలో భారతీయ మహిళల ఆలోచన ధోరణి క్రమంగా మారుతోంది. ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం గణనీయంగా పెరిగింది. 'విన్వెస్టర్ పల్స్ 2025-26' పేరుతో డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ నిర్వహించిన తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాపంగా 13 ప్రధాన నగరాల్లో మహిళా పెట్టుబడిదారులపై సర్వే నిర్వహించగా.. దాదాపు 56 శాతం మంది మహిళలు తమ పెట్టుబడి నిర్ణయాలను ఎవరిపైనా ఆధారపడకుండా స్వయంగా తీసుకుంటున్నారని తెలిపింది. 2022లో ఇది మహిళల్లో 44 శాతం, పురుషుల్లో 68 శాతంగా ఉంది. కాగా కేవలం మూడేళ్లలో ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం దేశ ఆర్థిక ముఖచిత్రంలో వస్తున్న నిర్మాణాత్మక మార్పునకు నిదర్శనమని వెల్లడించింది. అయితే మహిళా పెట్టుబడిదారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతున్నప్పటికీ ప్రణాళికబద్ధమైన పెట్టుబడుల విషయంలో కొంత లోటు కన్పిస్తున్నట్లు నివేదికలో తెలిపింది.సుమారు 84 శాతం మంది ఇన్వెస్టర్లు తాము స్వయంగా పెట్టుబడులు పెట్టగలమని నమ్మకం వ్యక్తం చేస్తున్నప్పటికీ కేవలం 33 శాతం మహిళలకు మాత్రమే స్పష్టమైన ఆర్థిక లక్ష్యం, దానిని చేరుకోవడానికి అవసరమైన పెట్టుబడి ప్రణాళికలు ఉన్నట్లు తేలింది. మహిళ ఆర్థిక లక్ష్యాల్లోనూ మార్పులు వస్తున్నాయి. సుమారు 50 శాతం మంది 'దీర్ఘకాలిక పెట్టుబడి'గా మూడేళ్ల లోపు కాలాన్ని భావిస్తుండగా.. కేవలం 28 శాతం మంది మాత్రమే ఐదేళ్లకు మించిన కాలాన్ని నిజమైన దీర్ఘకాలిక పెట్టుబడిగా విశ్వసిస్తున్నారు. డబ్బును మనుగడకు అవసరమైన వనరుగా కాకుండా వ్యక్తిగత స్వేచ్ఛకు చిహ్నంగా భావించే వారి సంఖ్య 27 శాతం నుంచి 35 శాతానికి పెరిగింది.

# భారత భావనకే ఇ.సి ఎసరు

భారతదేశమనే భావన సావర్కర్ అల్లిన హిందూత్వ భావజాలం లోంచి రూపొందలేదు. బ్రిటిష్ వలస పాలనను తరిమికొట్టేందుకు సాగిన జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో చిందిన నెత్తురు, చమట నుంచి అది రూపుదిద్దుకుంది. 1950 జనవరి 26న స్వీకరించబడిన రాజ్యాంగం పునాది స్తంభాలకు దోహదం చేసిన ఒక కొత్త తరహా సిద్ధాంత పత్రాన్ని ఆ భావన తీసుకొచ్చింది.ఆ ప్రాథమిక సూత్రాలేమిటి? ఆర్థిక, రాజకీయ, సార్వభౌమత్వం అన్నవి వలస పాలన తొలగింపు దిశగా ప్రయాణం, స్వాతంత్ర్య పోరాట కొనసాగింపులే కావడం తర్కబద్ధమైన విషయం. భారతీయ భావన లౌకిక మార్గం చేపట్టవలసి వచ్చింది. ప్రజల స్వేచ్ఛను గుర్తించడం, తమ విశ్వాసాలను అనుసరించేందుకు వారికిగల సమాన హక్కును గౌరవించడం, ఎలాంటి బుజ్జగింపులకూ లేక ప్రలోభాలకు లోబడకపోవడం సహజంగానే అవసరమైంది. అది తప్పక ప్రజాస్వామికంగా వుండవలసిందే. ఎందుకంటే బలహీనులకూ అధికారంగల వారికి మధ్య గొప్ప వ్యత్యాసాన్ని, అవకాశాలు, సంపదలలో వున్న అగాధాన్ని భర్తీ చేయడం సాధ్యపడదు. అనేక జాతుల, సంస్కృతుల, భాషల, ఆహార, వేషధారణల వైవిధ్యభరితమైన బహుళత్వాన్ని కాపాడేందుకు అది సమాఖ్యతత్వం తీసుకోవలసి వచ్చింది. లేకపోతే హిందూత్వ అనుయాయులు చెబుతున్నట్టు ఏకధృవ ఏకపక్ష మూస పద్ధతిలో ఒకే వరలో ఇమడ్చడం సాధ్యపడేది కాదు.

ప్రాణాధార సూత్రం భారతదేశమనే ఏ భావననైతే రాజ్యాంగం స్థాపించిందో అది నయా ఫాసిస్టు నమూనా పుస్తకంగా వుండజాలదన్నది స్పష్టమే. భారతదేశమనే భావన భిన్నత్వంతో కూడిన ప్రజలకు ఒకే ఉమ్మడి సమాన పౌరసత్వం వర్తింపచేసింది. అలాంటి భావన సార్వత్రిక వయోజన ఓటింగు అనే సూత్రం ప్రాతిపదికగా వుండాల్సిందే. అందరికీ ఒకే విధమైన భాగస్వామ్యమన్న సూత్రం అప్పుడే అమలవుతుంది. జాతీయ భాష, జాతీయ మతం అన్నది రాజ్యాంగం ఉద్దేశించిన వాటిలో లేదు.

పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యంలోని దృక్పథం వలెగాక ఈ దేశంలో సార్వత్రిక ఓటుహక్కును ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అమలు చేయవలసి వచ్చింది. అలాంటి విధానం లేకపోయినట్టయితే ఒక సమిష్టి ఉమ్మడి మనుగడతో భారత దేశ సమైక్యతకు ముప్పు వాటిల్లేది. ఈ ఆలోచన అమలుకు కేంద్రకం బలమైన రాజ్యాంగ సాధికారత కలిగిన భారత ఎన్నికల సంఘం (ఇసిఐ). ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అమలును అది పర్యవేక్షించాలి. అంతేగాక ఎన్నికల సంఘం చట్టబద్ధంగా భారత పౌరులైన ప్రతివారినీ ఓటర్ల జాబితాలో చేర్చడం ఇసిఐ పని అన్నది సుస్పష్టం. అది బాధ్యతే తప్ప ఎంతమాత్రం ఔదార్యం కానే కాదు. అందువల్లనే ఓటర్ల జాబితా తయారీ ఎన్నికల సంఘం పని తప్ప వ్యక్తిగతంగా పౌరుల పని కానే కాదు. భారత దేశమనే భావనను అమలు చేయడం కోసం రాజ్యాంగం ఇసిఐ కి అప్పగించిన బాధ్యత అది. ఈ సూత్రం ప్రాతిపదికగా పనిచేయడం వల్లనే ఇసిఐ దేశంలోనేగాక ప్రపంచమంతటా గుర్తింపు పొందింది.

ట్రంప్ ఐసిఇ-మన ఇసిఐ దురదృష్టవశాత్తూ సరిగ్గా ఇక్కడే భారతదేశమనే భావనకు ప్రస్తుతం ముప్పు ఎదురవుతున్నది. ఈ ప్రమాదానికి మూలం ఏమిటనే చర్చ పెద్దగా అవసరం లేదు. ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా పచ్చి మితవాద భావజాలం ప్రబలిన నేపథ్యంలో పౌరుల మత గుర్తింపులను బట్టి తేడాలు చూపించే హిందూత్వ సిద్ధాంతమే ఇందుకు కారణమవుతున్నది. ప్రపంచీకరణ, ఆయా దేశాల నిర్దిష్టమైన నయా ఉదారవాద నమూనాలు దీన్ని ఇంకా పెంచుతున్నాయి. ఈ కొత్త విధాన పత్రంలో పరాయివారిని చేయడం ఒక ప్రధాన భాగం. డోనాల్డ్ ట్రంప్ ఐసిఇ (ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ఏజంట్ల లాగే ఇండియా వరకూ చూస్తే ఆరెస్సెస్ భయం, అభద్రత జొప్పించేందుకు ప్రయత్నిస్తున్నది. వాస్తవంగా చెప్పాలంటే భారతదేశ సంక్షేమానికి స్వయం ప్రకటిత పరిరక్షకుడుగా అమిత్ షా దేశ అంతర్గత భద్రతకు బాధ్యత చేపట్టారు. కానీ జాతి మూలాలను తినేస్తున్న "చెద పురుగుల" లాంటి ఆ చొరబాటుదార్లను గుర్తించేందుకు ఆయన చిటికెన వేలైనా కదల్చలేదు.

కనుక కనీస సాక్ష్యాధారాల వంటివేమీ కూడా లేకుండానే చొరబాటుదారులు అన్న మాటను ఆయుధంగా చేయడం ఇసిఐ నమూనా పుస్తకంలోకి ప్రవేశించింది. గాలించు, తొలగించు, తరలించు అనే పాలికేక ఇసిఐ ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్.ఐ.ఆర్-సర్)కు అలిఖిత రాగంగా తయారైంది. చెద పురుగులుగా చిత్రించబడిన పౌరుల ఓటు హక్కు తొలగించడమే దాని లక్ష్యంగా మారింది.

బీహార్ టు బెంగాల్ ఏమైనా బీహార్‌లో మొదలై

## వేసవిలో చెరుకురసం..
# ఆరోగ్య ప్రయోజనాలు

ఇంటర్నెట్ డెస్క్: వేసవి కాలం వచ్చిందంటే ఎండ, వేడితో పాటు దాహం ఎక్కువగా ఉంటుంది. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచేందుకు కొబ్బరి నీళ్లు మంచివని అంటారు. ఈ సీజన్‌లో వరకు చల్లని పానియాలు.. అంటే కూల్ డ్రింక్స్, సోడాలు, పండ్ల రసాలు ఎక్కువగా తాగుతుంటారు. శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే చెరుకు రసం కూడా వేసవి కాలంలో ఎక్కువగా అమ్ముడుపోయే పానీయం. దీనితో శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి.

. డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం:ఎండల వల్ల మన శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో బయటకు పోతాయి. చెరకు రసంలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు శరీరానికి తిరిగి శక్తినిచ్చి, డీహైడ్రేషన్ కాకుండా కాపాడతాయి.



**2. తక్షిణ శక్తి:**

చెరకు రసంలో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి. ఇవి రక్తంలో త్వరగా కలిసిపోయి, ఎండ వల్ల వచ్చే అలసటను తక్షణమే పోగొడతాయి.

**3. కాలేయ ఆరోగ్యానికి మంచిది:**

ఆయుర్వేదం ప్రకారం, చెరకు రసం కాలేయాన్ని బలపరుస్తోంది. ముఖ్యంగా కామెర్లు వంటి సమస్యలు ఉన్నప్పుడు కాలేయం పనితీరు మెరుగుపరచడానికి ఇది ఎంతో మేలు చేస్తుంది.

**. చర్మ సౌందర్యం:**

ఇందులో ఉండే ఆల్ఫా హైడ్రాక్సి యాసిడ్స్ మొటిమలు తగ్గించి, చర్మాన్ని తాజాగా మెరిచేలా చేస్తుంది.

5. చెరుకు రసంలో కొంచెం అల్లం రసం, నిమ్మరసం, పుదీనా కలిపి తీసుకుంటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

రోడ్డు పక్కన బండ్ల మీద తాగేటప్పుడు ఈగలు లేకుండా, గ్లాసులు శుభ్రంగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.రసం తీయగానే తాగేయడం మంచిది. నిల్వ ఉంచితే అది త్వరగా ఆక్సీకరణం చెంది రంగు మారుతుంది.షుగర్ వ్యాధి ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవాలి. ఎందుకంటే ఇందులో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది

## రాత్రి పూట తినే సమయాన్ని కాస్త మారిస్తే చాలు..
# ఎంతో మేలు జరుగుతుంది..

**కేవలం తినే సమయాన్ని మారిస్తే చాలు..**

శరీరం సర్కేడియన్ రిథమ్ అనే సహజ జీవ గడియారాన్ని అనుసరిస్తుంది. ఇది నిద్ర, మెటబాలిజం, గుండె పనితీరు, హార్మోన్ విడుదల వంటి ప్రక్రియలను నియంత్రిస్తుంది. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల ఈ వ్యవస్థ దెబ్బతింటుంది. ఎందుకంటే ఆ సమయంలో శరీరం విశ్రాంతి తీసుకుని మరమ్మత్తు పనులు చేయాలి. కానీ తినడం వల్ల జీర్ణక్రియ కొనసాగుతుంది. దీంతో రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర నియంత్రణ తగ్గడం జరుగుతుంది. ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిని నిద్రకు మూడు గంటల ముందు తినడం ఆపమని, లైట్లు తగ్గించాలని, రాత్రి 13 నుంచి 16 గంటల వరకు ఉపవాసం ఉండేలా సూచించారు. కేలరీలు తగ్గించకుండా కేవలం తినే సమయాన్ని మార్చడం ద్వారా గుండె, మెటబాలిక్ ఆరోగ్యం మెరుగుపడుతుందని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా మధ్య వయస్సు, వృద్ధులలో ఇది ఎక్కువ



ప్రయోజనం చూపించింది. శరీరంలోని సహజ నిద్ర-జాగరణ రిథమ్‌కు అనుగుణంగా ఉపవాస సమయాన్ని అమలు చేస్తే గుండె, మెటబాలిజం, నిద్ర మధ్య సమన్వయం మెరుగుపడి గుండె ఆరోగ్యం కూడా రక్షించబడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

**రక్తపోటు, హార్ట్ రేట్‌లలో మెరుగుదల..**

ఈ పరిశోధనలో 36 నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న 39 మంది పెద్దలను పాల్గొనేలా చేశారు. వీరికి డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం కూడా ఉంది. వీరిని రెండు గ్రూపులుగా విభజించి ఈ పరిశోధనలు చేశారు. ఒక గ్రూపు వారిని రాత్రి 13-16 గంటలు ఉపవాసం ఉండేలా, మరో గ్రూపు వారిని 11-13 గంటలు ఉపవాసం ఉండేలా చూశారు. రెండు గ్రూపుల వారూ నిద్రకు మూడు గంటల ముందు తినడం ఆపి, లైట్లు తగ్గించమని సూచించారు. ఈ పరిశోధనల ప్రకారం వారిలో రాత్రి సమయంలో రక్తపోటు 3.5% వరకు తగ్గింది. అలాగే రాత్రి సమయంలో హార్ట్ రేట్ 5% వరకు తగ్గింది. తద్వారా ఇది గుండెపై ఒత్తిడిని కూడా తగ్గించింది. వీటితో పాటు పరిశోధనల్లో పాల్గొన్న వారిలో రక్తంలో చక్కెర నియంత్రణ మెరుగుపడింది. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరిగింది. రాత్రి సమయంలో కార్టిసాల్ హార్మోన్ తగ్గి మెటబాలిజం సమతుల్యం అయ్యింది.

**రాత్రిపూట తేలికైన ఆహారం తినాలి..**

పరిశోధకుల ప్రకారం, నిద్రకు అనుగుణంగా ఉపవాస సమయాన్ని పెంచడం అనేది గుండె, మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరచే సులభమైన జీవనశైలి మార్పుగా ఉపయోగపడుతుంది. ఇక ఈ అధ్యయనంలో 39 మంది మాత్రమే పాల్గొన్నారు. ఇది 7.5 వారాల పాటు మాత్రమే కొనసాగింది. పాల్గొన్నవారిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. అందువల్ల మరింత పెద్ద స్థాయి పరిశోధనలు అవసరం. అలాగే షిఫ్ట్‌లో పనిచేసేవారు లేదా తినే అలవాట్ల సమస్యలున్నవారికి ఈ పద్ధతి సరిపోకపోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇక 3 గంటల నియమాన్ని పాటించే విధానాన్ని కూడా నిపుణులు తెలియజేస్తున్నారు.

## బాల్యం ఎందుకు
# ఆనందంగా వుండాలి?

పిల్లలు ఎందుకు ఆనందంగా ఉండాలి? ఎందుకు సంతోషంగా పెరగాలి? ఆనందం లేకుండా పెరిగిన పిల్లలు భవిష్యత్తులో ఎలాంటి వ్యక్తులుగా తయారవుతారు? అసలు బాల్యంలో ఆనందం అనేది ఎలా ఉంటుంది? పిల్లలపై ఎలాంటి హింస జరుగుతూ ఉంది? పిల్లల ఆనందం కోసం పెద్దలు ఏమి చేయాలి? ఈ విషయం గురించి వివరంగా తెలుసుకుందాం.

**బాల్యం గురించి ఏమీ తెలియని ప్రపంచం**

ప్రపంచ మానవాళి ప్రకృతి గురించి, జీవుల గురించి ఎంతో విజ్ఞానం సంపాదించింది. శాస్త్రజ్ఞులు ఎన్నో ప్రయోగాలు వీటిపై చేశారు. కొత్త ఆవిష్కరణలు రూపొందించారు. చివరకు మానవుడి అవయవాలు ప్రయోగశాలలో పెంచే వరకు వచ్చారు. కానీ మనిషి బాల్యం గురించి, వారి పెరుగుదల గురించిన జ్ఞానాన్ని మాత్రం సంపూర్ణంగా సంపాదించలేదు. శిశువు బాల్య దశలో ఎలాంటి వాతావరణంలో పెరిగితే ఎలాంటి వ్యక్తిగా తయారవుతాడు? గొప్ప కవులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, స్వాములు, సన్యాసులు, ప్రజాసేవకులు, హంతకులు, దొంగలు, మంచివారు, చెడ్డవారు వీరంతా శిశు బాల్య దశల్లో ఎలాంటి వాతావరణంలో పెరిగారు? వారి తల్లిదండ్రులు ఎలాంటి వారు? కుటుంబ జీవనం ఎలాంటిది? కొందరు ప్రజల కోసం ఎందుకు ప్రాణాలు ఇస్తున్నారు? మరొకరు ఎందుకు ఇతరుల ప్రాణాలు తీస్తున్నారు? ఇలాంటి అన్ని విషయాలపై దీర్ఘకాలం సమగ్ర పరిశోధనలు ఏవీ జరగలేదు? జంతువులపై చేసిన ప్రయోగాలు మనుషులపై ప్రయోగిస్తున్నారు. బాల్యం అనేది వ్యక్తిగతం కాదు. అది కుటుంబ సమస్యో, ఒక దేశ సమస్యో కాదు. పేదరికానికి చెందిన సమస్య కూడా కాదు. అది ప్రపంచ మానవాళి సమస్య. మానవ సమాజం ఏ వైపు సాగాలో దిశా నిర్దేశం చేసే సమస్య. బాల్యం అనేది భవనానికి పునాది వంటిది. ఆ పునాది భద్రంగా ఉండాలి కదా! ఆ పునాది నిర్మాణం వైపా, విధ్వంసం వైపా ఆలోచించాలి.

**బాల్యంపై జరుగుతున్న హింస**

బాలలపై జరుగుతున్న హింస గురించి ఎంత చెప్పినా తక్కువే. పిల్లల భవిష్యత్తు పేరుతోనో, వారి మేలుకోసమో, ఆనందం కోసమో అన్నట్టు జరిగే హింస సంగతి ముందుగా తెలుసుకోవాలి. ఇది చదువుల పేరుతోనూ, సమాజపు అంగీకారంతోనూ, అజ్ఞానంతోనూ జరుగుతున్న హింస. బాల్యం గురించి ప్రపంచానికి ఏమీ తెలియదని నేను మొదట చెప్పిన సంగతి అన్నిటికంటే ఈ చదువులకు ఎక్కువగా వర్తిస్తుంది. ఒక విషయం గురించిన జ్ఞానం పిల్లలు ఎలా సంపాదించుకుంటారు? వారి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా బలవంతంగా నేర్పడం సాధ్యమవుతుందా? భయంతో జ్ఞానాన్ని సంపాదించగలరా? పరీక్షల భయం, టీచర్ల భయం, తల్లిదండ్రుల భయం, గంటల తరబడి కూర్చుని వినడం, అనుభవంతో తెలుసుకోవలసిన విషయం కంఠస్థం చేయాల్సి రావడం, ఇతరులతో పోల్చడం, శిక్షలు, బహుమతులు ఇవన్నీ పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తాయి? బాలికలైనా, బాలురైనా పిల్లలపై జరిగే లైంగిక హింస సంగతి సమాజానికి తెలిసేది ఒక శాతమే. ఇళ్లల్లో, హాస్టళ్లలో, పనిచేసే ప్రదేశాల్లో, మత సంస్థల్లో చాలా రహస్యంగా ఇది జరిగిపోతూ ఉంటుంది. పైకి చెప్పుకోలేని హింస ఇది. ఆటల్ని అటకెక్కించి కథలనీ, కబుర్లనీ కంచికి పంపించి, నిరంతరం నీతులు చెబుతూ, తిట్లతో దబాయింపులతో బాల్యాన్ని నలిపేసి, నరకం చేస్తే, ఆ పిల్లలు కసి ద్వేషం పగలతో రగిలిపోతూ పెరిగితే వాళ్లు మనుషులుగా మిగులుతారా? మానవత్వంతో పెరుగుతారా? చుట్టూ ఉన్న నేర ప్రపంచం రారమ్మని ఆహ్వానిస్తుంటే ఏమి జరుగుతుందో మనకు తెలియదా?

**బాల్యం ఒక బంగారు కాలం**

మనుషులు వయస్సును బట్టి ఒక్కో దశ దాటుకుంటూ భవిష్యత్తులోకి అడుగుపెడతారు. వీరు బాల్య కౌమార దశలు దాటి యవ్వనంలో ప్రవేశిస్తారు. నూతన ఉత్సాహంతో ఉరకలు వేస్తూ చదువులు పూర్తి చేసి, ఉద్యోగంలో చేరుతారు. పెళ్లి చేసుకుంటారు. పిల్లలు పుడతారు. సొంత ఇంటి కల నెరవేరుతుంది. పిల్లల చదువులు, ఉద్యోగ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు మరేవో సమస్యలు చుట్టుముట్టుకొంటాయి. జీవితం ఏదో తేడాగా కనిపిస్తుంది. ఆలోచిస్తూ మధన పడతారు. అప్పుడు గుర్తుకు వస్తుంది ఆనందంగా లేని సంగతి. గతాన్ని గుర్తు చేసుకుంటూ కాలంతో వెనక్కి వెళ్లి చూస్తాం. బాల్యంలోకి తొంగి చూస్తాం. ఒకసారి గుండెలు ఆనందంతో పొంగిపోతాయి. అది బంగారు కాలం. స్వర్గం. బాధ్యతలు బరువులు లేని బాల్యం. కుల మతాల అడ్డుగోడలు లేని స్వేచ్ఛా ప్రపంచం. ఆస్తులు, అంతస్తులు తేడాలు వొంటబట్టని వయస్సు. కల్లాకపటం లేని హృదయాలు. కొట్టుకుంటారు, తిట్టుకుంటారు అంతలోనే కలిసిపోయి ఆడుకుంటారు.ఆటలు, మాటలే వారికి ఆనందాలు. వారికి విలువైన ఆట వస్తువులు అవసరం లేదు. మట్టి, ఇసుక, రాళ్లు, కర్ర పుల్లలు, గాజు పెంకులతో ఆడుకుంటారు. చిన్న చిన్న విషయాలకి పగలబడి నవ్వుకుంటారు. కదిలే కుక్క తోకను చూసి కడుపుబ్బ నవ్వుతారు. తెరలు తెరలుగా అలసిపోయే వరకు నవ్వుతూనే ఉంటారు. బ్రహ్మానంద భరితులవుతారు. వారి శరీరంలో ప్రతి అణువు పులకించిపోతుంది. ఆనందమనేది ఇలా ఉంటుందని, స్వర్గం అనేది బాల్యమేననీ అర్థం చేసుకుంటాంమనుషులు జీవితంలో విజయం సాధించినప్పుడు, ఉద్యోగం వచ్చినప్పుడు, కొత్తబట్టలకు కొనుక్కున్నప్పుడు, కోరికలు తీరినప్పుడు పొందేవి ఆనందాలు కాదు. అది తీయటి మిఠాయిలను తిన్నప్పుడు కలిగే సంతృప్తి లాంటిది. అది కొద్దిసేపు ఉండి మరుగున పడిపోతుంది. కానీ బాల్యంలోని ఆనందం అంతరంగానికి చెందినది. బాల్యంలో పొందిన ఆనందం మరి దేని వల్ల కూడా పొందలేనిది.

# ఎన్నికల ముంగిట...


పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి కేవలం గంట ముందు, 2008 నుంచి పేరుకుపోయిన కరవు భత్యం (డీఏ) బకాయిలను చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఆమె ఈ విషయాన్ని తెలిపారు.”మా ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు, లక్షలాది మంది



ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం సంతోషంగా ఉంది. ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం, ఆర్‌ఓపీఏ 2009 డీఏ బకాయిలను 2026 మార్చి నుంచే అందుకోవడం ప్రారంభిస్తారు” అని తన ప్రకటనలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో పంచాయతీలు, మున్సిపల్ సంస్థల ఉద్యోగులకు కూడా లబ్ధి చేకూరనుంది.2008 నుంచి 2019 మధ్య కాలానికి చెందిన డీఏ బకాయిలలో 25 శాతాన్ని మార్చి 31 నాటికి చెల్లించాలని ఈ ఏడాది ప్రారంభంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఏ ఉండేలా చూడాలని, బకాయిలను దశలవారీగా చెల్లించాలని కూడా అత్యున్నత న్యాయస్థానం సూచించింది.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఏ, బకాయిలు చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఈ నెలలో ‘పని నిలిపివేత’ నిరసన కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సుదీర్ఘ డిమాండ్‌కు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ముందు మమత సర్కార్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు..

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలో రాజకీయ వేడిని మరింత పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదివారం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రంలోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. అనంతరం, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి, మే 6వ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది. ఈ ప్రకటనతో దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా భావించే తమిళనాడులో ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది.ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా ఓటర్ల జాబితా ప్రకారం, రాష్ట్రంలో మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ జాబితాలో 7,617 మంది ట్రాన్స్‌జెండర్ (థర్డ్ జెండర్) ఓటర్లు నమోదు కావడం విశేషం. వీరితో పాటు దాదాపు 4.63 లక్షల మంది దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన 3.99 లక్షల మంది వృద్ధులు కూడా ఓటర్ల జాబితాలో ఉన్నారు. ఈ వర్గాల ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ ఎన్నికల్లో యువ ఓటర్ల పాత్ర అత్యంత కీలకం కానుంది. 18-19 ఏళ్ల వయసు మధ్య ఉన్న 12.51 లక్షల మంది యువత తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాలతో పోలిస్తే, తమిళనాడులోనే తొలిసారి ఓటు వేయనున్న యువత సంఖ్య అత్యధికంగా ఉండటం గమనార్హం. ఇది రాష్ట్ర రాజకీయాలపై యువతరం ప్రభావం ఎంతగా పెరిగిందో తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో, యువ ఓటర్లను



ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదునుపెట్టనున్నాయి.రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని 234 అసెంబ్లీ స్థానాల్లో 44 స్థానాలను షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ), రెండు స్థానాలను షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) రిజర్వ్ చేసినట్లు ఈసీఐ పునరుద్ఘాటించింది. ఓటర్ల సౌకర్యార్థం, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 75,032 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రద్దీని నియంత్రించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లకు మాత్రమే పరిమితం చేశారు. ముఖ్యంగా, ఎత్తైన నివాస భవనాలు, హౌసింగ్ సొసైటీలు, జనసాంద్రత అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఓటర్లకు పోలింగ్ బూత్‌లను మరింత చేరువ చేశారు. షెడ్యూల్ విడుదల కావడంతో, ఇక పార్టీలు అభ్యర్థుల ఖరారు, ప్రచార కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నాయి.

# వివాదాస్పద వ్యాఖ్యలపై ఏఆర్ రెహమాన్ మరోసారి క్లారిటీ



ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై మరోసారి స్పందిస్తూ వివరణ ఇచ్చారు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయనకు ఈ కాంట్రవర్సీపై ప్రశ్న ఎదురవగా మొదట మాట్లాడేందుకు నిరాకరించినప్పటికీ చివరికి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆ సంఘటనను మర్చిపోయి తాను జీవితంలో ముందుకు సాగిపోతున్నానని రెహమాన్ స్పష్టం చేశారు. జీవితంలో ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేలా ముందుగానే సిద్ధంగా ఉండాలని, కొన్ని విషయాల నుంచి త్వరగా బయటపడటం మంచిదని ఆయన పేర్కొన్నారు. "మనమేమిటో తెలిసినవారికి ప్రత్యేకంగా వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒకవేళ చెప్పినా వాళ్లు వినరు" అంటూ నవ్వుతూ చెప్పిన ఆయన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. ఇదే విషయంపై ఇంతకుముందు కూడా స్పందించిన రెహమాన్, కొన్ని సందర్భాల్లో ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని, ఎవరినీ బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఎప్పుడూ లేదని తెలిపారు. భారతదేశం తనకు గొప్ప స్ఫూర్తి అని, ఇండియానే తన ఇల్లు మరియు గురువని పేర్కొంటూ భారతీయుడిగా ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. సంగీతం అనేది దేశ సంస్కృతిని అనుసంధానించే ఒక పవిత్రమైన మార్గమని, దాన్ని ఎల్లప్పుడూ గౌరవంగా చూస్తానని సోషల్ మీడియాలో ఒక వీడియో ద్వారా వెల్లడించారు. కాగా ఇటీవల 'బీబీసీ ఏషియన్ నెట్‌వర్క్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మతపరమైన కోణం కారణంగా బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గి ఉండొచ్చని, హిందీ సినీ పరిశ్రమలో నిర్ణయాధికారాలు క్రియేటివిటీ లేని వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా వాటిని తప్పుబట్టారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. అయితే తాజా ఇంటర్వ్యూలో రెహమాన్ ఇచ్చిన వివరణతో ఈ వివాదం కొంత శాంతించే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.




# అల్లూ వారబ్బాయి మాములు రొమాంటిక్ కాదు..



ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు, యువ హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్న సంగతి తెలిసిందే. నయనికతో ఆయన వివాహం మార్చి నెలలో జరగనుంది. ఈ నేపథ్యంలో పెళ్లికి ముందే తన స్నేహితులకు దుబాయ్‌లో గ్రాండ్ బ్యాచిలర్ పార్టీ ఇచ్చి సందడి చేశారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జనవరి 30, 31 తేదీల్లో జరిగిన ఈ పార్టీకి అల్లు కుటుంబ సన్నిహితులు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సహా శిరీష్ స్నేహితులు హాజరయ్యారు. తాజాగా అల్లు శిరీష్ తన సోషల్ మీడియా ఖాతాలో పార్టీ వీడియోను షేర్ చేయగా అది అభిమానుల్లో ఆసక్తిని రేపుతోంది. డియోలో కాబోయే భార్య నయనికకు శిరీష్ ప్రేమగా ముద్దు పెట్టుకోవడం హైలైట్‌గా నిలిచింది. అలాగే స్నేహితులందరూ షిప్‌పై చిల్ అవుతూ, డ్యాన్స్ చేస్తూ ఎంజాయ్ చేసిన దృశ్యాలు కనిపించాయి. దుబాయ్ తీరంలోని ఓ లగ్జరీ యాట్‌లో ఈ బ్యాచిలర్ పార్టీ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలో అల్లు అర్జున్ స్పెషల్ అట్రాక్షన్‌గా మారగా, నయనిక మోడ్రన్ దుస్తుల్లో తళుక్కుమంటూ అందరి దృష్టిని ఆకర్షించింది. వీడియో బయటకు రాగానే నెటిజన్లు, అభిమానులు కాబోయే దంపతులకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.కొన్ని నెలలుగా అల్లు శిరీష్ వివాహంపై సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వినిపించాయి. అయితే శిరీష్ స్వయంగా నయనికతో తన నిశ్చితార్థం జరిగిందని ప్రకటించి క్లారిటీ ఇచ్చారు.నయనిక పెద్ద వ్యాపార కుటుంబానికి చెందినదని, హైదరాబాద్-బెంగళూరు నగరాల్లో వారి కుటుంబానికి భారీ వ్యాపారాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది.ఏది ఏమైన ప్రీ వెడ్డింగ్ పార్టీలో శిరీష్ చేసిన హంగామా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇక బన్నీ కూడా ఈ పార్టీలో తెగ సందడి చేశారు.

ఆ ఫొటోలు కూడా వైరల్‌గా మారాయి. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే అల్లు శిరీష్ 2013లో "గౌరవం" సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. అనంతరం కొత్త జంట, శ్రీరస్తు శుభమస్తు, ఏబీసీడీ, ఒక్క క్షణం, ఊర్వశివో రాక్షసివో వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది "బడ్డీ" సినిమాలో కనిపించిన ఆయన, కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు పెళ్లి వేడుకలతో వార్తల్లో నిలుస్తుండగా, టాలీవుడ్ మరో గ్రాండ్ మ్యారేజ్‌కు సిద్ధమవుతోంది.

# అల్లు అర్జున్‌తో పోరాటానికి సిద్ధమైన రష్మిక..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం "ఊూ22ఇూూ6 దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్ పని చేస్తుండటం విశేషం. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా ఖరారవ్వడంతో మూవీపై క్రేజ్ మరింత పెరిగింది. అల్లు అర్జున్ ఇందులో రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నాడన్న ప్రచారం అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది.తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరో కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. నేషనల్ క్రష్ రష్మిక మందానా ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయినట్లు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో రష్మికతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రష్మిక పాత్ర విలన్ ఛాయలతో ఉండనుందనే టాక్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కథలో కీలక మలుపులు తిప్పే పాత్రలో ఆమె కనిపించనుందనే ప్రచారం సినిమాపై హైప్‌ను మరింత పెంచుతోంది. అల్లు అర్జున్-రష్మిక కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అన్న ముద్ర ఉంది. 'పుష్ప: ది రైజ్', 'పుష్ప 2: ది రూల్' చిత్రాల్లో వీరిద్దరి జోడీ సంచలన విజయాలు అందుకుంది. అలాంటి హిట్ పెయిర్ ఇప్పుడు మరోసారి కలిసి నటిస్తుండటం ఒక ఎత్తయితే, ఈసారి రష్మిక హీరోకు ప్రతినాయకురాలిగా కనిపించ నుందన్న వార్త మరింత ఆసక్తికరంగా మారింది. ఇన్నాళ్లు రొమాంటిక్ జంటగా అలరించిన ఈ జోడీ ఇప్పుడు సరికొత్తగా కనిపించనుందనే టాక్ అభిమానుల్లో కొత్త ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇక ఈ చిత్రంలో జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కూడా కీలక పాత్రల్లో నటించనున్నారనే ప్రచారం సాగుతోంది. అలాగే రమ్యకృష్ణ, యోగి బాబు, జిమ్ సర్భ్ వంటి ప్రముఖ నటులు కూడా భాగమవుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపు నెలరోజుల పాటు సాగే ముంబయి షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలు, కీలక కథా మలుపులను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్న యోచనలో మేకర్స్ ఉన్నట్లు ఫిలిం నగర్ వర్గాలు చెబుతున్నాయి.

# నిర్బంధంలో రిటైర్డ్ ఆర్మీ అధికారి.. సోదరుడి కోసం నటి సెలీనా జైట్లీ పోరాటం



బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ కుటుంబానికి సంబంధించిన ఓ సంఘటన ప్రస్తుతం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఆమె సోదరుడు, భారత సైన్యంలో పారా స్పెషల్ ఫోర్సెస్‌లో సేవలందించి రిటైర్ అయిన మేజర్ విక్రాంత్ జైట్లీ, గత కొన్ని నెలలుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్బంధంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో తన సోదరుడిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని సెలీనా భావోద్వేగంగా కోరుతున్నారు. సమాచారం ప్రకారం, 2024 సెప్టెంబర్‌లో దుబాయ్‌లోని ఓ షాపింగ్ మాల్ వద్ద విక్రాంత్‌ను స్థానిక అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత కొన్ని నెలల పాటు ఆయన ఉన్న స్థలం కుటుంబానికి స్పష్టంగా తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.ప్రస్తుతం ఆయన అబుదాబిలోని అల్-వత్బా డిటెన్షన్ సెంటర్లో ఉన్నట్లు సమాచారం. అధికారికంగా ఆయనపై "జాతీయ భద్రత"కు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని మాత్రమే వెల్లడించగా, పూర్తి వివరాలు మాత్రం బయటకు రాలేదు. ఈ వ్యవహారంపై కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో, ఢిల్లీ హైకోర్టు విదేశాంగ మంత్రిత్వ శాఖకు కీలక సూచనలు చేసింది. విక్రాంత్ తరఫున న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక న్యాయ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అంతర్జాతీయ న్యాయ నిబంధనల ప్రకారం ఒక భారతీయ పౌరుడికి లభించాల్సిన సహాయాన్ని తక్షణం అందించాలని కోర్టు స్పష్టం చేసింది. గతంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను కేంద్ర ప్రభుత్వం సురక్షితంగా తిరిగి తీసుకువచ్చిన సందర్భాలను గుర్తు చేస్తూ, అదే విధంగా ఈ విషయంలోనూ చర్యలు తీసుకోవాలని సెలీనా విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారం కారణంగా కుటుంబం ఆర్థికంగా, వ్యక్తిగతంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆమె తెలిపారు. సెలీనా చేసిన ప్రకటనలు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. పలువురు అభిమానులు, సామాజిక వర్గాల నాయకులు ఆమెకు మద్దతు తెలుపుతూ విక్రాంత్ త్వరగా విడుదల కావాలని ఆకాంక్షిస్తున్నారు. అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉన్నప్పటికీ, ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆసక్తి, ఆందోళన వ్యక్తమవుతోంది.

# నేచురల్ బ్యూటీయే అసలైన అందం..



ప్రస్తుతం సినీ పరిశ్రమలో అందంగా కనిపించేందుకు ఖరీదైన బ్యూటీ ట్రీట్మెంట్లు, ఫేస్ ఫిల్లర్లు, కాస్మెటిక్ ప్రొసీజర్లు చేయించుకోవడం సాధారణమైపోయింది. ముఖ్యంగా సెలబ్రిటీలు పబ్లిక్ ఫిగర్స్ కావడంతో ఎప్పుడూ యవ్వనంగా, ఆకర్షణీయంగా కనిపించాలనే ఒత్తిడి ఎక్కువగానే ఉంటుంది. అందుకే చాలా మంది హీరోలు, హీరోయిన్లు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రత్యేక చర్మ సంరక్షణ చికిత్సలు తీసుకుంటున్నారు. అయితే ఈ ట్రెండ్ మధ్య కోలీవుడ్ స్టార్ హీరో ఆర్. మాధవన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒకప్పుడు తమిళ చిత్రసీమలో వరుస విజయాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న మాధవన్ ప్రస్తుతం బాలీవుడ్‌లో కూడా బిజీగా కొనసాగుతున్నారు. 50 ఏళ్లు దాటినా ఇంకా యువకుడిలా కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు.ఈ నేపథ్యంలో ఆయన యవ్వన రహస్యం ఏమిటి అని అభిమానుల్లో ఆసక్తి నెలకొనడం సహజం. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇదే ప్రశ్న ఎదురవగా మాధవన్ ఇచ్చిన సమాధానం అందరినీ ఆలోచింపజేసేలా ఉంది. యవ్వనంగా కనిపించేందుకు ఆర్టిఫిషియల్ టెక్నిక్స్ ఉపయోగించడం ఒక రకంగా మోసమే. ఖరీదైన బ్యూటీ ట్రీట్మెంట్లు చేయించుకోను అని మాధవన్ స్పష్టం చేశారు. తన చర్మ సంరక్షణ రహస్యం ఎంతో సింపుల్ అని చెబుతూ ప్రతిరోజూ కొబ్బరినూనె ఉపయోగిస్తానని, ఉదయం సూర్యరశ్మిని ఆస్వాదించడం మిస్ కావడంలేదని తెలిపారు. ఇవే తన నేచురల్ స్కిన్ కేర్ టిప్స్ అని చెప్పారు. అంతేకాక ప్రతి ఆదివారం నువ్వుల నూనెతో తలస్నానం చేయడం తనకు అలవాటని, గత 20 ఏళ్లుగా ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నానని వెల్లడించారు. ఆహార విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, బయట ఫుడ్ కంటే ఇంట్లో వండిన తాజా ఆహారానికే ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. షూటింగ్‌లకు కూడా తన చెఫ్‌ను వెంట తీసుకెళ్లి పప్పు, కూర, అన్నం వంటి సాధారణ ఆహారమే తీసుకుంటానని చెప్పారు. సమతుల్య ఆహారం పాటిస్తే ఆరోగ్యంగా, అందంగా ఉండవచ్చని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# సమ్మర్ 2026పై మెగా ముద్ర..

2026 సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్నారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాలీవుడ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. సంక్రాంతి సీజన్ ముగియడంతో ఇప్పుడు సినీ ప్రేక్షకుల దృష్టంతా సమ్మర్ సీజన్‌పై పడింది. ఈ నేపథ్యంలో పెద్ద సినిమాలన్నీ వరుసగా వేసవి విడుదలలకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం పరిస్థితులు గమనిస్తే సమ్మర్ 2026పై మెగా ఫ్యామిలీ డామినేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఐదు సినిమాలు మెగా కుటుంబం నుంచి విడుదలకు రెడీ అవ్వడం విశేషం.

అందులో మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ వంటి టాప్ హీరోల సినిమాలు కూడా ఉండటంతో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సమ్మర్ సీజన్‌కు శ్రీకారం చుట్టేది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అనే చెప్పాలి.పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ తరువాత మెగా డాటర్ నిహారిక నిర్మాతగా ఉన్న 'రాకాస' చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ ఫాంటసీ-హారర్ కామెడీ జానర్‌లో రాబోతోంది. తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సమయం మొదలవుతుంది. ఆయన హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా మంచి హైప్ ఉంది. భారీ బడ్జెట్, భారీ అంచనాలతో ఈ చిత్రం సమ్మర్ హైలైట్‌గా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది.ఇక మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మరో ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర'. దర్శకుడు వశిష్ట రూపొందిస్తున్న ఈ పాన్ ఇండియా ఫాంటసీ డ్రామా భారీ గ్రాఫిక్స్‌తో జూలైలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. విజువల్ వండర్‌గా నిలిచే అవకాశమున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' కూడా సమ్మర్ బరిలోకి దిగుతోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343